بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 9

సంచిక : 40

వార్షిక చందా 600/-రూ॥

03 అక్టోబర్ 2024 క్రీ, శ. 03 ఇఖా 1403 హి, శ.

29 రబీఉల్ అవ్వల్ 1446 హి,ఖ.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

رَبَّنَآ اِنَّكَ تَعۡلَمُ مَا نُخۡفِیۡ وَمَا نُعۡلِنُ ؕ وَمَا یَخۡفٰی عَلَی اللّٰہِ مِنۡ شَیۡءٍ فِی الۡاَرۡضِ وَلَا فِی السَّمَآءِ ○

**అనువాదం:** ఓమా ప్రభువు! మేము దాచునదంతయు, మేము బహిర్గతం చేయునదంతయు నీవు ఎరుగుదువు. నిశ్చయముగా భూమిలో గాని, ఆకాశంలో గాని అల్లాహ్‌తో ఏదియును దాగి ఉండ లేదు.

**( ఇబ్రాహీం: 39)**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్ గారికి ఆరోగ్యవంతమైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చుగాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

**మసీహ్ మౌవూద్ సమాజీకులుగా పిలువబడుతూ, అనుచరుల సమాజంతో కలువాలని ఆకాంక్షించే మీరు, మీలో అనుచరుల సారుప్యతలను పెంపొందించుకోవాలి.**

## హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:

దైవత్వంను విశ్వసింపజేయునట్టి తేజస్సు, ఉద్వేగం మరియు ఉదాసీనతల సారుప్యంలు గల ఆ౦ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి రూపురేఖలలో ప్రజల మనస్సును నిరభ్యంతరంగానే ఆకర్శించునట్టి గురుత్వాకర్షణ మరియు దైవిక శక్తులు ఉన్నాయి. అందువలనే వారి (స) సమాజీకులు కూడ అట్టి ప్రవక్తను అనుసరించుటలో గొప్ప ఆదర్శంను నెలకొలిపారు. వారి విశ్వాసపటిష్టత కూడ ఎంతో గొప్ప మహత్యంగా నిలిచింది. అట్టి మహిమానిత్యులను ఎవరు చూసిన వారు కూడ నిరాటంక ముగానే వారి (రజి)ని అనుసరించుటకు వచ్చేవారు. మొత్తానికి అనుచరుల అట్టి స్థితి మరియు విశ్వాసంల అవసరం నేడు కూడ గలదు. ఎందుకనగా మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చేతుల మీదుగా సంస్కరించ బడుతున్న ఈ సమాజంను అల్లాహ్ తాలా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తీర్చిదిద్దిన సమాజంలో కలుపుతున్నాడు. పైగా ఇలాంటి ఆదర్శవంతుల నడవడికతోనే జమాఅత్ కూడ అభివృద్ధి చెందుతుంది. అందువలనే మసీహ్ మౌవూద్ సమాజీకులుగా పిలువబడుతూ, అనుచరుల సమాజంతో కలువాలని ఆకాంక్షించే మీరు, మీలో అనుచరుల సారుప్యతలను పెంపొందించుకోవాలి. వారి వలే విధేయతను కనబర్చాలి, వారి వలే పరస్పర ప్రేమానురాగాలను, ఆప్యాయతలను వ్యక్తపర్చాలి. మొత్తానికి మీరు అన్ని విధాలుగా, అన్ని కోణాలలో అనుచరులు అనుసరించిన విధానాలనే అనుసరించాలి. నన్ను వ్యతిరేకిస్తూ నన్ను దూషించేవారిని, అవిశ్వాసుడు, అసత్యుడు అని ప్రచారం చేసేవారిని గూర్చి నేను ఏ మాత్రం పట్టించుకోను. ఎందుకనగా అల్లాహ్ తాలా ప్రతి మానవునికి అవగాహన స్వాభావికతను, నిర్ణయాత్మక సామర్థ్యమును అనుగ్రహించాడు. మానవుడు, తాను విసర్జించు మలము దుర్వాసనను తానుగా గ్రహించ గలుగుతాడు. ఇది ఆమోధయోగ్యమైన విషయమైనప్పుడు, ఒక ఖచ్చిత నిబద్ధత అయినప్పుడు, మరి మలము దుర్వాసనకంటే ఎక్కువ దుర్వాసను కల్గినటు వంటి అసత్యపు దుర్వాసనను, అసత్యము పలుకువాడు ఇది అసత్యము అని ఎందుకు గ్రహించలేక పోతున్నాడు?. అంటే తప్పకుండా గ్రహిస్తున్నాడు. మరి అలాంటప్పుడు సత్యవంతులకే సాధ్యమయ్యే విధముగా ఒక అసత్యవంతుడు అల్లాహ్ తాలా పేరుతో ఇంత బలంగా, ఇంత నిలకడగా ఎలా వాగ్దానాలు చేయగలడు? ఎలా పురోగతిని సాధించగలడు?, ఎందుకు ఎలాంటి నష్టాన్ని కల్గించలేక పోతున్నారు? అనే విషయాన్ని వారు ఎందుకు గ్రహించలేక పోతున్నారో నాకు అర్థం కావడం లేదు.

**(మల్ఫూజాత్ సంపుటి 2, పేజి 35, ప్రచురణ ఖాదియాన్ 2018)**

**జంతువును ఖుర్బానీ ఇచ్చే వ్యక్తి తన మనో వాంచలన్నింటిని త్యాగం చేయుటకు సిద్ధముగా ఉంటాడని అర్థం. నిజానికి అతడు “ నేను అల్లాహ్ మార్గంలో సర్వం త్యాగం చేయుటకు సిద్ధముగా ఉన్నాను ” అని అంగీకారంను తెల్పుచున్నాడు.**

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ అన్హు అల్ హజ్జ్ అధ్యాయానికి చెందిన 38వ సూక్తిని విశ్లేషిస్తూ ఇలా తెలిపారు.

ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, ఖుర్బానీ చేయడం వలన ఆయా జంతువుల మాంసం లేదా రక్తం గాని అల్లాహ్‌కు చేరుతుందని ఏ మాత్రం అర్థం కాదు. దాని వలన కేవలం దార్మికత మాత్రమే పెరుగుతుంది. ఆదే వాస్తవం. ఆ దార్మికతయే అల్లాహ్‌కు ఇష్టం. అల్లాహ్ తాలా జంతువులను ఖుర్బాని ఇవ్వమని ఆదేశిస్తున్నాడు, జంతువుల ఖుర్బానీలను ఎంతో ఇష్టముగా స్వీకరిస్తుంటాడు, ఆపై ఖుర్బానీ చేయువారికి స్వర్గమును ప్రసాదిస్తానని శుభవార్తలను అందిస్తు ంటాడు. నవూజుబిల్లాహ్ అల్లాహ్ తాలా ఏమైన హైందవుల దేవతల వలే మాంసపు ఆకలిని, రక్తపు దాహాన్ని కల్గియున్నాడా? అని కొందరు ఆరోపణలు చేస్తుంటారు. అందుకు సమాధానంను అల్లాహ్ తాలా ఈ సూక్తిలో తెలియజేశాడు. అనగా ఖుర్బానీలోనిఆంతర్యం ఖుర్బానీ జంతువుల మాంసం, రక్తం అల్లాహ్‌కు చేరుతుందని కాదు, వాటి వలన కేవలం మానవ మనస్సులో దైవభీతి, నిష్టా పరతలు పెంపొందుతాయి. ఆ నిష్టావరతలే అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైనవి. కావున ఎవరైతే ఒంటెలను, ఆవులను లేదా మేకలను ఖుర్బానీ చేసి తాము అల్లాహ్ ప్రీతిని పొందాము అని భావించేవారు పొరపాటు పడుతున్నారు. మీరే జంతువు లను ఖుర్బానీ చేసి, మీరే ఆ మాంసంను తింటున్నారు కావున ఇదేమి ప్రత్యేకత కాదని, దీని వలన అల్లాహ్ వరకు ఏమి చేరుకోదని అల్లాహ్ తాలా ఎంతో స్పష్టముగా తెల్పుచున్నాడు. ఇది కేవలం చిత్రకళా పరిభాషలో వాస్తవాన్ని వ్యక్తపర్చు ఒక విధానం మాత్రమే. ఈ విధానంలో అతి ప్రగాఢమైన వివేకత దాగియున్నది. ఏ విధముగానైతే చిత్రకళా కారులు ఎల్లప్పుడు చిత్రాలు వేస్తుంటారు. కాని వారి లక్ష్యం కేవలం చిత్రాలు వేయడమే కాదు. వాస్తవానికి ఆయా చిత్రాల ద్వారా వారు తమ జాతి ప్రజలకు అత్యంత విలువైన సందేశాన్ని అందిస్తుంటారు. అందుకే వారు అప్పుడప్పుడు గొలుసుకట్టును చిత్రిస్తుంటారు. దాని అర్థం సమాజ ఐక్యత. కొన్ని సార్లు వారు ఉదయించే సూర్యుడిని గీస్తారు. దాని అర్థం సమాజ అభివృద్ధి అవుతుంది. అదే విధముగా ఈ బహిరంగముగా చేయునట్టి ఖుర్బానీ కూడ ఒక సందేశాన్ని ఇస్తుంది. అదేమనగా జంతువును ఖుర్బానీ ఇచ్చే వ్యక్తి తన మనో వాంచలన్నింటిని త్యాగం చేయుటకు సిద్ధముగా ఉంటాడని అర్థం. నిజానికి అతడు “ నేను అల్లాహ్ మార్గంలో సర్వం త్యాగం చేయుటకు సిద్ధముగా ఉన్నాను ” అని అంగీకారంను తెల్పుచున్నాడు.

**(తదుపరి సంచికలో)**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

■ హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహ్ అన్హు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ఆధారం చేసుకొని ఈ విధముగా ఉల్లేఖించారు. హుజూర్ (స) ఒక ఒంటెను బదులుగా తీసుకున్నారు. ఒంటె యజమాని హుజూర్ (స) వద్దకు వచ్చాడు. హుజూర్ (స)ను ఒంటెను తిరిగి ఇవ్వమని అడిగాడు. అందుకు అనుచరులు అతనితో (కొంత కఠినముగా) మాట్లాడినారు. అప్పుడు హుజూర్ (స) “ అప్పు ఇచ్చినవారు అలాగే మాట్లాడుతుంటారు. ” అని అన్నారు. ఆ తరువాత హుజూర్ (స) అతడు ఇచ్చిన ఒంటెకు బదులుగా ఎక్కువ వయస్సు గల ఒంటెను తిరిగి ఇచ్చారు. ఆపై “ అప్పును సకాలంలో తిరిగి చెల్లించిన వారే మీలో ఉత్తములు” అని తెలిపారు.

■ హజ్రత్ ఇబ్నే ఉమర్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. వారు ఒకసారి దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి ప్రయాణించారు. ఆ సమయంలో వారు హజ్రత్ ఉమర్ రజి ఒంటెపై స్వారి చేస్తున్నారు. అది వేగంగా ప్రయాణిస్తుంది. ఈ క్రమంలో ఆ ఒంటె దైవ ప్రవక్త (స) ఒంటె కన్న వేగంగా ప్రయాణించ సాగింది. ఆ సమయంలో వారి తండ్రి “ ఓ అబ్దుల్లాహ్ ! దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కంటే ముందుగా ప్రయాణించవద్దు” అని మందలించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఉమర్ రజితో “ఆ ఒంటెను నాకు అమ్మివేయండి ” అని అడిగారు. అందుకు హజ్రత్ ఉమర్ రజి “హుజూర్ ఈ ఒంటె మీరు ఇచ్చినదే” అని సమాధానం ఇచ్చారు. మొత్తానికి హుజూర్ (స) ఆ ఒంటెను కొనుగోలు చేశారు. ఆ తరువాత “ఓ అబ్దుల్లాహ్! ఇప్పుడు ఈ ఒంటె నీదే. దీనితో నీవు ఏ పనిని అయినా చేయించుకోవచ్చును ” అని హుజూర్ (స) అన్నారు.

ఈ సంచికలో...

**(1) 17 మే 2024 నాటి జుమా ప్రసంగం ........ పేజి 2లో.**

**(2)హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో అనుచరుల ఎనలేని ప్రేమ...... పేజి 7లో.**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

సరియా రజీఈ ప్రస్తావన కొనసాగుతుంది. ఈ యుద్ధంను గూర్చిన మరికొన్ని వివరాలు అహదీస్ మరియు చారిత్రాత్మక గ్రంథాలలో ఈ విధముగా పేర్కొనబడ్డాయి. సహీ బుఖారీలో రజీఈ ఘటనను గూర్చి ఈ విధముగా వివరముగా గలదు. హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పది మందిని సరియ్యాకు చెందిన పరిస్థితులను గూర్చి తెలుసుకొని రమ్మని పంపారు. వారిపై హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ అన్సారీ రజిను నాయకుడిగా నియమించారు.

అజల్ మరియు ఖారా తెగలకు చెందిన ఈ ద్రోహులు ఉస్ఫాన్ మరియు మక్కా నగరాల మధ్యకు చేరుకోగానే ముసల్మానులు తమతో వస్తున్నారని, మీరు కూడ త్వరగా చేరుకోండి అని వారు గోప్యముగా బనూ లైహాన్ ప్రజలకు సమాచారంను అందించారు. అందువలన బనూ లైహాన్‌కు చెందిన 200ల మంది సైనికులు వారిలో 100 మంది సైనికులు విల్లు విద్యలో నేర్పుకల్గిన వారు ఉన్నారు. అందరు ముసల్మానులను వెంబడిస్తూ బయలుదేరినారు.

కావున వారు దాడులు చేస్తూ అనుచరులు రిజ్వానుల్లాహ్ అజ్మయీన్‌లను చుట్టు ముట్టారు. బృంధ నాయకులైన హజ్రత్ ఆసిమ్ రజి మరియు వారి మిత్రులకు వాస్తవం అర్థంకాగానే వారు వెంటనే ఫద్ ఫద్ అనే ఒక కొండచర్యపైకి చేరుకోని దాచుకున్నారు.

మక్కాకు చెందిన ఖురైష్‌లకు రజీఈ ప్రాంతంలో బనూ లైహాన్ చేతిలో మీరమరణం పొందిన వారిలో ఆసిమ్ బిన్ సాబిత్ రజి ఉన్నారని తెలియగానే, వారు రజీఈ ప్రాంతం వద్దకు కొంతమందిని ప్రత్యేకముగా పంపించారు. ఆపై వారికి ఆసిమ్ రజి తల లేదా మరేదైన శరీర భాగాన్ని కోసి తీసుకొని రండి, ఫలితముగా ప్రతీకార జ్వాల నుండి శాంతించ వచ్చునని సూచించారు. ఎందుకనగా హజ్రత్ ఆసిమ్ రజి గారే బదర్ యుద్ధంలో ఖురైష్‌ల ప్రముఖ నాయకులను హతమార్చినారు.

" 7గురు అనుచరులు హతమార్చబడ్డారు. కేవలం ఖుబైబ్ బిన్ అద్ది రజి మరియు జైద్ బిన్ దసినహ్ మరియు మరొక అనుచరులు మాత్రమే మిగిలి ఉన్నారు. వాస్తవానికి అవిశ్వాసులు ముసల్మానులందరిని ప్రాణాలతో పట్టుకోవాలని భావించారు. అందుకే వారు మరల గట్టిగా అరిచారు. ఇప్పుడైన క్రిందికి రండి. మేము మీకు ఎలాంటి నష్టాన్ని కల్గజేయము. అని మాట ఇచ్చారు. ఈ సారి ఈ సాధారణ మనస్థత్వం గల ముసల్మానులు వారి మాటలను నమ్మి క్రిందికి వచ్చారు.

నేను ముస్లింగా ఉన్న స్థితిలో హతమార్చబడుతున్నాను. కావున ఎటువైపు తిరిగి పడుతానే విషయంను గూర్చి నేను పట్టించుకోను. నేను పడిపోవడం అనేది అల్లాహ్ ప్రీతికొరకు మాత్రమే. ఒకవేళ అతడు కోరుకున్నచో ముక్కలు ముక్కలు చేయబడిన శరీరమును కూడ కలిపి మరల ప్రాణం పోయగలడు.

మొత్తానికి వారు చేసిన త్యాగాలు ఇవి. మరణం పట్ల ఏ మాత్రం భయపడేవారు కాదు. ఇస్లాం కొరకు ప్రాణాలను అర్పించుటకు ఈ అనుచరులు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండేవారు. ఈ సరియ్యను గూర్చిన ప్రస్తావన ఇంకా మిగిలి ఉన్నది. ఇన్షా అల్లాహ్ తదుపరి జుమాలో ప్రస్తావించుతాను.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 17 మే 2024, (17 హిజ్రత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ـ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ـ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ـ

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ـ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ـ

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ـ

సరియా రజీఈ ప్రస్తావన కొనసాగుతుంది. ఈ యుద్ధంను గూర్చిన మరికొన్ని వివరాలు అహదీస్ మరియు చారిత్రాత్మక గ్రంథాలలో ఈ విధముగా పేర్కొనబడ్డాయి. సహీ బుఖారీలో రజీఈ ఘటనను గూర్చి ఈ విధముగా వివరముగా గలదు. హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పది మందిని సరియ్యాకు చెందిన పరిస్థితులను గూర్చి తెలుసుకొని రమ్మని పంపారు. వారిపై హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ అన్సారీ రజిను నాయకుడిగా నియమించారు. వారు వెళ్ళిపోయారు. అలా వారు ఉస్ఫాన్ మరియు మక్కా నగరాల మధ్యలో ఉన్నటు వంటి హదాఅ ప్రాంతంనకు చేరుకున్న తరువాత హుజైల్ తెగకు చెందిన ఒక వర్గం బనూ లైహాన్‌కు చెందిన, వీరిని గూర్చి ప్రస్తావించడం జరిగింది. ముస్లిం వ్యతిరేక తెగనుండి సుమారు 200ల మంది ఎదురువచ్చారు. వీరందరు విల్లుకారులే. వారందరు ముసల్మానుల అడుగులను వెంబడిస్తూ వారిని అనుసరించారు. అలా వారు ముసల్మానులు ఖర్జూర ఫలములు తింటున్న చోటుకు చేరుకున్నారు. అనుచరులు ఆ ఖర్జూర ఫలములను మదీనా నుండి ప్రయాణ భోజనం కొరకు తీసుకవచ్చారు. బనూ లైహాన్ తెగవారు ఆ ఖర్జూర ఫలములను చూసి ఇవి మదీనాకు చెందినవి అని గుర్తుపట్టినారు. అలా వారు ముసల్మానుల పాదాల గుర్తులను అనుసరించారు. ఈ క్రమంలో హజ్రత్ ఆసిమ్ రజి మరియు వారి మిత్రులు శత్రువులను చూసిన వెంటనే ఒక మట్టిదిబ్బ పైకి చేరుకొని దాచుకున్నారు. కాని ఈ శత్రువులు వారిని ముట్టడించారు. ఆపై వారు ముసల్మానులను క్రిందికి రమ్మని అనగా శత్రువులు ముసల్మానులను క్రిందికి రమ్మని పిలిచారు. ఒకవేళ మీరు లొంగిపోయినచో మేము మిమ్ములను ఏమి చేయము, మేము మీలో ఎవ్వరిని హత్య చేయము అని వాగ్దానం చేస్తున్నాము అని నమ్మబలికారు. సరియ్య నాయకుడు హజ్రత్ ఆసిమ్ బిన్ సాబిత్ రజి వారితో ఇలా అన్నారు. నా విషయానికి వచ్చినచో దేవుని ప్రమాణం! నేను ఎట్టి పరిస్థితులలో ఒక అవిశ్వాసుని అభయాన్ని కోరుకోను . ఆ తరువాత వారు రజి ఇలా దుఆ చేశారు. ఓ అల్లాహ్ ! మా పరిస్థితిని గూర్చి నీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియజేయుము.

వారు అనగా శత్రువులు వారిపై అనగా అనుచరులు రిజ్వానుల్లాహ్ అలైహి అజ్మయీన్‌లపై బాణాలు వేయడం ప్రారంభించారు. అలా వారు హజ్రత్ ఆసిమ్ రజి మరియు ఇతర 7గురు అనుచరులను హతమార్చినారు. ముగ్గురు అనుచరులు మాత్రం వారి మాటలను విని క్రిందికి వచ్చారు. వారిలో ఖుబైబ్ అన్సారి రజి మరియు ఇబ్నే దసిన్న రజిలు వారితో పాటు అబ్దుల్లాహ్ బిన్ తారీఖ్ అనే మరొక అనుచరుడు ఉన్నాడు. శత్రువులు ముగ్గురిని ఖైది చేశారు. ఆపై వారు తమ విల్లుల దారములను విప్పినారు. వారిని బంధించారు. అప్పుడు ఆ మూడవ వ్యక్తి వారితో "ఇది మీ మొదటి ద్రోహం. అల్లాహ్ ప్రమాణం! నేను మీతో రాను " అని అన్నాడు. నిశ్చయముగా వారు ఆదర్శవంతులు. వారి ఉద్దేశం అమరులు. శత్రవులు ఆ అనుచరుడిని లాగి తీసుకవెళ్ళుటకు ప్రయత్నించారు. వారిని తమతో తీసుకవెళుటకు బలవంతముగా ప్రయత్నించారు. అందుకు ఆ అనుచరుడు ప్రతిఘటించాడు. కావున ఆ శత్రువులు వారిని హతమార్చినారు. ఆ తరువాత వారు హజ్రత్ ఖుబైబ్

రజి మరియు హజ్రత్ దసిన రజిలను తీసుకవెళ్ళి మక్కాలో విక్రయించారు. హజ్రత్ ఖుబైబ్ రజిను బనూ హారిస్ బిన్ ఆమిర్ బిన్ నౌఫిల్ బిన్ అబ్దే మన్నాఫ్‌లు కొనుగోలు చేశారు. ఎందుకనగా బదర్ యుద్ధంలో హజ్రత్ ఖుబైబ్ రజియే హారిస్ బిన్ ఆమిర్ ను హతమార్చినారు. హజ్రత్ ఖుబైబ్ రజి వారి వద్ద బంధీగా ఉన్నారు. ఇది బుఖారికి చెందిన కథనము.

**(సహి బుఖారి, కితాబుల్ జిహాద్ వ స్సియర్ బాబ్ హల్ యస్తాసిర్ రజుల్ వ మిన్ లం యస్తాసిర్.. హదీస్ 3045)**

బుఖారి కథనము ప్రకారంగా చూసినచో 10 అనుచరులతో కూడిన ఒక బృంధం గూడాచర్యం కొరకే బయలుదేరిందని తెలుస్తుంది. వీరు చాటుమాటుగా ప్రయాణిస్తుండగా మదీనా ఖర్జూర ఫలముల గింజలను చూసి గుర్తించిన ఒక మహిళ అరుపులు కేకలు వేసింది. ఫలితముగా శత్రువులు వారిపై దాడి చేశారు. కాని చాలా మంది చరిత్ర కారులు మాత్రం ఈ బృంధం చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి పరిస్థితులను తెలుసుకోవడం కోసమే ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు. కావున ఇంకా ఈ బృంధాన్ని పంపక ముందే హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చిన పార్టితో ఈ బృంధాన్ని పంపించారు.

ఈ ఆంశంను గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు మరియు హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు చారిత్ర గ్రంథాల నుండి సేకరించిన ఆంశాల ఆధారముగా వారు కూడ ఆ పార్టి వారితోనే బయలు దేరినారు అని పేర్కొన్నారు. ఆయా ప్రజలతో కలిసి వెళ్ళారు. కావున బుఖారి మరియు ఇతర జీవిత గ్రంథాలలో వారు చాటుమాటుగా ప్రయణిస్తుండేవారు అని తెల్పిన విషయం బహుష ఉల్లేకులు పొరపాటున పేర్కొని ఉండవచ్చునని అర్ధ మవుతుంది. ఎందుకనగా ఈ పార్టికి చాటుమాటుగా వెళ్ళవలసిన అవసరమే లేకుండెను. నిజానికి ఈ అనుచరులు బృంధం అజల్ మరియు ఖారా తెగలకు చెందిన పార్టి సభ్యులతో బయలుదేరింది. ఆః ఇక్కడ ఈ విధముగా కూడ అంచాన వేసుకోవచ్చును. అనగా వీరు ఉస్ఫాన్ మరియు మక్కా నగరాల మధ్య ప్రాంతానికి చేరుకోగానే అజల్ మరియు ఖారా తెగల ప్రజలు నిజానికి వారు ఒక కుట్ర ద్వారా ఈ అనుచరులు బృంధాన్ని తమ వెంట తీసుకవస్తున్నారు కావున ఆ ప్రాంతానికి చేరుకోగానే తమ ఒప్పందాలను ఉల్లఘింస్తూ ముందు నుండే ఏర్పాటు చేసుకున్న ప్రణాళికల ప్రకారం బనూ లైహాన్ ప్రజలకు సమాచారంను అందించి ఉండవచ్చును. ఫలితముగా వారు 200ల మంది విల్లుకారులతో ఆ ప్రాంతానికి చేరుకోని ఉండవచ్చును. వాస్తవం అల్లాహ్‌కు తెలియును.

మొత్తానికి బనూ లైహాన్‌కు చెందిన 200ల మంది సైనికులలో 100 మంది సైనికులు విల్లుకారులు. కావున వారు దాడులు చేస్తూ అనుచరులు రిజ్వానుల్లాహ్ అజ్మయిన్‌లను చుట్టు ముట్టారు. బృంధ నాయకులైన హజ్రత్ ఆసిమ్ రజి మరియు వారి మిత్రులకు వాస్తవం అర్థంకాగానే వారు వెంటనే ఫద్ ఫద్ అనే ఒక కొండచర్యపైకి చేరుకోని దాచుకున్నారు. మరొక కథనములో ఆ కొండచర్య పేరును ఖర్‌దద్ అని పేర్కొన్నారు. అవిశ్వాసులు అనుచరులను చుట్టు ముట్టారు. ఆపై ఇలా అన్నారు. ఒకవేళ మీరు మా వద్దకు వచ్చినచో మేమ మిమ్ములను ఏమి చేయము, ఎవరిని చంపము. దేవుని ప్రమాణం! నిశ్చయముగా మేము మిమ్ములను చంపాలనే ఉద్దేశంతో రాలేదు, మిమ్ములను అడ్డుపెట్టుకొని మక్కా వారి నుండి కొంత ధనమును పొందాలని అనుకున్నాము అని వాగ్దానం చేశారు.

**(సబీలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 40, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ లిబ్నాన్)**

అందుకు హజ్రత్ ఆసిమ్ రజి ఇలా అన్నారు. దేవుని ప్రమాణం! నేను ఏ అవిశ్వాసుడి అభయంలోకి రాను. జీవితంలో ఎన్నడు ఏ అవిశ్వాసుడి అభయంలోకి రాకూడదని నేను సంకల్పించుకున్నాను. వారి మిగిలిన అనుచరులు కూడ ఈ విధమైన సమాధానంనే ఇచ్చారు. అనగా మేము ఎన్నడు కూడ అవిశ్వాసుల మాటలను నమ్మము అని తేల్చిచెప్పారు. ఆ సమయంలోనే హజ్రత్ ఆసిమ్ రజి అల్లాహ్ తాలాతో "అల్లాహుమ్మా అఖ్‌బిర్ నబియ్యక" ఓ అల్లాహ్! నీ ప్రవక్త (స)కు మా పరిస్థితిని గూర్చి తెలియజేయుము అని దుఆ చేశారు. మొత్తానికి ఇరుపక్షాల మధ్య పోరటం కూడ జరిగింది. **(సీరత్ ఇన్‌సైక్లోపీడియా సంపుటి 6, పేజి 453, ప్రచురణ దారుస్సలాం రియాజ్ హిజ్రి 1434)**

అనుచర బృంధం నాయకులు హజ్రత్ ఆసిమ్ రజి ధైర్యవంతముగా పోరాడినారు. పోరాడుతూ తమ కవిత్వపు పంక్తులను కూడ పాడసాగాడు. వాటి అనువాదం ఈ విధముగా ఉన్నది. నేను ఎందుకు యద్ధాన్ని నిలిపివేయాలి?. నిజానికి నేను నేర్పుగల విల్లుకారుడిని, పరాక్రవంతుడిని, నా విల్లుకు చాలా గట్టి దారం బంధించబడి ఉన్నది. నా విల్లు నుండి పొడువాటి, వెడల్పాటి మొనతేలిన విల్లులు సంధించబడుతాయి. మరణం తథ్యమే. జీవితానికి వాస్తవమే లేదు. అల్లాహ్ తాలా దేనినైతే నిశ్చయించినాడో అది తప్పకుండా మానవున్ని చుట్టుకుంటుంది. మానవునికి అల్లాహ్ వైపు వెళ్ళవలసి ఉంటుంది. ఒకవేళ నేను మీతో పోరాడకున్నచో నా తల్లి నన్ను తప్పిపోతుంది. ఆ పంక్తుల అర్థం ఇది. అనుచరులందరు ఎంతో విరోచితముగా, ధైర్యముగా శత్రువులతో పోరాడసాగారు. వారిని ఎదురిస్తూనే ఉన్నారు.

హజ్రత్ ఆసిమ్ రజి శత్రువులపై బాణాలను సంధిస్తూనే ఉన్నారు. చివరికి బాణాలు అయిపోయాయి. అప్పుడు భర్చీతో పోరాడడం మొదలుపెట్టారు. ఆ క్రమంలో భర్చీ కూడ విరిగిపోయింది. కేవలం ఖడ్గమే మిగిలిపోయింది. ఇకవారికి వారి మరణం పట్ల నమ్మకం కలుగగానే, తమ వివస్త్రతను గూర్చి భయం కలుగగానే, ఎందుకనగా శత్రువులు మృతుల శరీరాలను త్రొక్కుతారు, వాటిని నగ్నంగా వదిలి వేస్తారు. కావున వారు వెంటనే అల్లాహ్ తాలా ఈ విధముగా దుఆ చేశారు.

**అల్లాహుమ్మా హమైతు తీనక అవ్వల నహారి ఫహ్‌మిలీ లహమీ ఆఖిరహు** అనగా ఓ అల్లాహ్! నేను ఉదయం నుండి నీ ధర్మమును రక్షించాను. ఇక ఈ రాత్రికి నీవే నా శరీరంను కాపాడుము. ఈ దుఆ చేసిన తరువాత వారు ఖడ్గపు యుద్ధంను ప్రారంభించారు. ఖడ్గము దాడితో ఇద్దరు వ్యక్తులను తీవ్రముగా గాయపర్చి ఒక వ్యక్తిని హతమార్చినారు. అప్పటికే మరణ సందేశం చేరుకున్నది. కావున వారు వీరమరణం పొందారు. అలా వారు తమ మిగిలిన 6గురు మిత్రులతో కలిసి అత్యంత వైభవంతమైన వీరమరణాన్ని పొందారు.

**(దాయిరే మాఅరిఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 7, పేజి 140, ప్రచురణ బజమే ఇక్బాల్, లాహోర్ 2022)**

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు ఈ ఘటనను గూర్చి ఇలా పేర్కొన్నారు. "ఆః హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హిజ్రి 4వ సంవత్సరం సఫర్ నెలలో 10 అనుచరులతో కూడిన ఒక బృంధాన్ని సిద్ధం చేశారు. ఆ బృంధానికి ఆసిమ్ బిన్ సాబిత్ రజిను నాయకుడిగా నియమించారు. చాటుమాటుగా మక్కా చుట్టు ప్రక్కల ప్రాంతాలకు చేరుకోని ఖురైష్‌ల స్థితి గతులను గూర్చి తెలుసుకోండి, వారి కార్యకలాపాలను మరియు వారి నిర్ణయాలను గూర్చి తెలుసుకోని సమాచారంను అందించమని ఆదేశించారు. కాని ఈ బృంధం ఇంకా బయలుదేరక ముందే అజల్ మరియు ఖారా తెగలకు చెందిన కొందరు ప్రజలు హుజూర్ (స) సన్నిదికి చేరుకోని ఇలా విన్నవించుకున్నారు. మా తెగకు చెందిన చాలా మంది ప్రజలు ఇస్లాం పట్ల ఆసక్తిని చూపుతున్నారు. మీరు కొంత మంది మీ అనుచరులను మాతో పంపించండి. వారు మమ్ములను ముసల్మానులుగా మార్చి, మాకు ఇస్లాం బోధనలను నేర్పుతారు. ఆః హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఈ ఆకాంక్షను తెలుసుకొని చాలా సంతోషించారు. సమాచారంను సేకరించుటకు సిద్ధము చేసిన ఆ బృంధాన్నే వారితో పాటు పంపించారు. కాని తరువాత తెలిసిన విషయమేమనగా, ఆ ప్రజలు మోసం చేశారు. బనూ లైహాన్ పన్నిన కుట్రలో భాగంగానే వారు మదీనాకు వచ్చారు. వారు తమ నాయకుడైన సఫ్యాన్ బిన్ ఖాలిద్‌ను హతమార్చినందున ప్రతీకారం తీర్చుకొనుటకే ఈ కుట్రకు పాల్పడినారని తెలిసింది. ఈ కారణంగా ముసల్మానులు మదీనా నుండి బయటికి వచ్చినచో వారిపై దాడిచేసి వారిని హతమార్చవచ్చునని భావించారు. ఇందుకు బనూ లైహాన్ ప్రజలు అజల్ మరియు ఖారా ప్రజలకు ఈ పని చేసిపెట్టినందుకు చాలా ఒంటెలను మరియు నగదును బహుమానంగా చెల్లిస్తామని కూడ వాగ్దానం చేశారు. అజల్ మరియు ఖారా తెగలకు చెందిన ఈ ద్రోహులు ఉస్ఫాన్ మరియు మక్కా నగరాల మధ్యకు చేరుకోగానే ముసల్మానులు తమతో వస్తున్నారని, మీరు కూడ త్వరగా చేరుకోండి అని వారు గోప్యముగా బనూ లైహాన్ ప్రజలకు సమాచారంను అందించారు. అందువలన బనూ లైహాన్‌కు చెందిన 200ల మంది సైనికులు వారిలో 100 మంది సైనికులు విల్లు విద్యలో నేర్పుకల్గిన వారు ఉన్నారు. అందరు ముసల్మానులను వెంబడిస్తూ బయలుదేరినారు. రజీఇ ప్రాంతంలో వారిని చుట్టు ముట్టారు.

10 మంది 200ల మంది సైనికులను ఎలా ఎదురించగలరు. కాని ముసల్మానులు ఎట్టి పరిస్థితులలో వెన్నుచూపకూడదని బోధించడం జరిగింది. అందువలన వెంటనే ఈ అనుచరులు శత్రువులతో పోరాడుటకు సమీపంలో ఉన్నటు వంటి ఒక గుట్టపైకి చేరినారు. మోసం చేయడం తప్పుగా భావించబడని అవిశ్వాసులు మీరు ఆ గుట్టను దిగి క్రిందికి రండి, మేము మీలో ఎవరిని హతమార్చము అని ప్రగల్బాలు పలికారు. ఆసిమ్ రజి అందుకు ఇలా సమాధానం ఇచ్చారు. " మీ మాటలపై మాకు ఎలాంటి నమ్మకం లేదు. మేము మీ మాటలను

నమ్మి క్రిందికి రాలేము." ఆ తరువాత ఆకాశం వైపు ముఖము త్రిప్పుచు " ఓ అల్లాహ్! మా పరిస్థితిని నీవు చూస్తున్నావు. మీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు మా స్థితిని గూర్చి తెలియజేయుము. " అని వేడుకున్నారు. మొత్తానికి ఆసిం రజి మరియు వారి మిత్రులు కలిసి పోరాడినారు. చివరికి పోరాడుతూనే ప్రాణాలను వదిలివేశారు. " **(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) హ|జత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి ఎం.ఏ పేజి 513-514)**

హ|జత్ ఆసిమ్ బిన్ సాబిత్ రజి మృతదేహాన్ని అల్లాహ్ తాలా ఏ విధముగా కాపడినాడు?. అంతకు ముందే వారు ఓ అల్లాహ్! నా శరీరాన్ని కాపాడుము అని అల్లాహ్ తాలాతో దుఆ చేశారు కదా!. ఈ విషయాన్ని గూర్చి హ|జత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు ఇలా పేర్కొన్నారు. "ఈ రజీఈ ఘటనను గూర్చిన క్రమంలోనే కొన్ని కథనాలు ఈ విధముగా గలవు. మక్కాకు చెందిన ఖురైష్‌లకు రజీఈ ప్రాంతంలో బనూ లైహాన్ చేతిలో వీరమరణం పొందిన వారిలో ఆసిమ్ బిన్ సాబిత్ రజి ఉన్నారని తెలియగానే, వారు రజీఈ ప్రాంతం వద్దకు కొంతమందిని ప్రత్యేకముగా పంపించారు. ఆపై వారికి ఆసిమ్ రజి తల లేదా మరేదైన శరీర భాగాన్ని కోసి తీసుకొని రండి, ఫలితముగా ప్రతీకార జ్వాల నుండి శాంతించ వచ్చునని సూచించారు. ఎందుకనగా హ|జత్ ఆసిమ్ రజి గారే బదర్ యుద్ధంలో ఖురైష్‌ల ప్రముఖ నాయకులను హతమార్చినారు. మరొక కథనములో ఈ విధముగా గలదు. ఏ వ్యక్తినైతే హ|జత్ ఆసిమ్ రజి హతమార్చినారో ఆ వ్యక్తి తల్లి సులాఫా బిన్తే సఅద్ తన కుమారుడిని హతమార్చిన వారి మెదడు చిప్పలో మధ్యంను సేవిస్తాను అని ప్రతిజ్ఞ చేసింది. ఇందుకై ఎవరైతే అతని మెదడు చిప్పను తీసుకవచ్చి ఇస్తారో అతనికి 100 ఒంటెలను బహుమానంగా ఇస్తానని కూడ ప్రకటించింది. ఇంత ధారుణంగా వారిలో ప్రతీకారపు జ్వాలలు రగిలిపోసాగాయి. కాని అల్లాహ్ మహత్యం ఎంత గొప్పగా పని చేసిందనగా, ఈ ప్రజలు అక్కడికి చేరుకోని చూడగా గుర్రపు కందిరీగలు మరియు తేనేటీగలు గుంపులు గుంపులుగా ఆసిమ్ రజి మృతదేహం వద్ద ఉన్నాయి. ఎంతగా ప్రయత్నించినా కూడ అవి అక్కడి నుండి ప్రక్కకు వెళ్ళలేదు. ఆ కందిరీగలు మరియు తేనే టీగలు అక్కడి నుండి వెళ్ళగొట్టుటకు వీరు చాలా ప్రయత్నం చేశారు. కాని ఆ ప్రయత్నం ఫలించలేదు. చివరికి ఈ ప్రజలు ఏమి చేయలేక నిస్సహాయ స్థితిలోనే వెనుదిరిగి పోయారు. ఆ తరువాత వెంటనే ఒక తూఫాన్ వచ్చింది. ఆ వరదలకు ఆసిమ్ రజి మృతదేహం కొట్టుకపోయింది. మరల ఇలా లిఖించబడి ఉన్నది. ఆసిమ్ రజి ముసల్మానుడైన తరువాత ఇలా ప్రతిజ్ఞ చేశాడు. ఇకపై వారు అన్ని రకాల అన్యారాధన పద్ధతులన్నింటి నుండి కూడ దూరంగా ఉంటారు. చివరికి అన్యారాధులను ముట్టుకోకూడదు అని నిశ్చయించు కున్నాడు. హ|జత్ ఉమర్ రజికు వారి వీరమరణం మరియు ఆ ఘటనను గూర్చి తెలియగా హ|జత్ ఉమర్ రజి ఇలా అన్నారు. అల్లాహ్ కూడ తన దాసుల మనో భావాలను ఎంతగొప్పగా కాపాడుతాడో చూడండి!. మరణం తరువాత కూడ అల్లాహ్ తాలా ఆసిమ్ రజి ప్రతిజ్ఞనను నెరవేర్చినాడు. అన్యారాధులు వారిని ముట్టుకోకుండా అడ్డుకున్నాడు. **(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స), హ|జత్‌మిర్జా బషీర్ అహ్మద్ రజి ఎం.ఏ పేజి 516) (అత్తబ్ఖాతుల్ కుబ్రా, సంపుటి 3, పేజి 352, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహెరూత్c 1990)(అల్ మవాహిబ్ లిల్ దీనియ, సంపుటి 1, పేజి 424, ప్రచురణ మక్తబల్ ఇస్లామీ బేహెరూత్ 2004)**

హ|జత్ ఆసిమ్ రజిను హమియ్యు ద్దబీర్ అని పిలిచేవారు. అనగా కందిరీగలు మరియు తేనటీగల ద్వారా రక్షించబడిన వారు అని అర్థం. అల్లాహ్ తాలా వారు రజి మృతి చెందిన తరువాత ఈ కందిరీగల గుంపుల ద్వారనే వారిని కాపాడినారు. ఆ తరువాత హ|జత్ ముఅత్తిబ్ బిన్ ఉబైద్ మరియు ఇతర అమాయకుల వీరమరణపు గాధలు గలవు. హ|జత్ ముఅత్తిబ్ బిన్ ఉబైద్ రజి పోరాడుతూ పోరాడుతూ తీవ్రముగా గాయపడ్డారు. శత్రువులు మార్గంను అన్వేషిస్తూ వారి వరకు చేరుకోని వారిని హతమార్చినారు. వారు కాకుండా మరో 5గురు అనుచరులు కూడ అలాగే పోరాడుతూ పోరాడుతూ శత్రువుల బాణాలకు బలై వీరమరణాన్ని పొందారు. అలా మొత్తం 7గురు అనుచరులు వీరమరణాన్ని పొందారు. ఇక కేవలం 3 అనుచరులు మాత్రమే మిగిలి ఉన్నారు. వారి పేర్లు ఇలా గలవు. హ|జత్ ఖుబైబ్ బిన్ అద్ది రజి, హ|జత్ జైద్ బిన్ దసినహ్ రజి మరియు హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్ రజి. **(అల్ అసాబ, సంపుటి 3, పేజి 461, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహెరూత్c 1995)(సీరత్ ఇన్‌సైక్లోపీడియా సంపుటి 6, పేజి 454, ప్రచురణ దారుస్సలాం రియాజ్ హి|జ 1434)**

శత్రువులు ఈ ముగ్గురు అనుచరులతో మేము మిమ్ములను ఏమి చేయము, మేము మీకు మాట ఇస్తున్నాము. కావున మీరు మిమ్ములను మాకు అప్పగించుకోండి అని పలికారు. అందుకు ఆ అనుచరులు ఆ కొండచర్యల పై నుండి క్రిందికి దిగి వచ్చారు. ఆ అనుచరులు తమ ఆధీనంలోకి చేరుకోగానే శత్రువులు తమ విల్లుల దారములను విప్పి వాటి సహాయంతో అనుచరులను బంధించారు. అప్పుడు హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్ రజి వారితో ఇది మీరు చేస్తున్న మొదటి ద్రోహం. అల్లాహ్ ప్రమాణం! నేను మీతో పాటు రాను. ఆ వీరమరణం పొందిన అనుచరుల వలే వీర మరణం పొందడమే నాకు ఇష్టం అని అన్నారు. కాని శత్రువులు బలవంతముగా వారిని తీసుకవెళ్ళుటకు చాలా ప్రయత్నించారు. కాని అబ్దుల్లాహ్ బిన్ తారీఖ్ వారి వెళ్ళలేదు. అందువలన వారు హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ తారీఖ్ రజిను అక్కడే హతమార్చినారు. **(సబీలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 41, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహెరూత్ లిబ్నాన్)**

కొన్ని కథనాల ప్రకారంగా చూసినచో శత్రువులు ఆ ముగ్గురు అనుచరులను బంధించి వారిని మక్కావైపు తీసుకవెళ్ళసాగారు. వారు ఈ అనుచరులను మక్కా వారికి విక్రయించాలని చూశారు. వీరు మక్కాకు 22 మైళ్ళ దూరంలో ఉత్తర దిశలో ఉన్నటు వంటి మర్రు జ్జహ్‌రాన్ ప్రాంతానికి చేరుకోగా, హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ తారీఖ్ రజి గారి చేతులు వదిలించుకున్నారు. ఆపై ఖడ్గమును చేత పట్టుకొని వ్యక్తి గతమైన పోరాటానికి సిద్ధమైనారు. శత్రువులు వారిలో ఉన్నటు వంటి జిహాద్ స్ఫూర్తిని చూసి వెంటనే వెనుకడుగు వేశారు. ఆపై రాళ్ళతో దాడి చేయసాగారు. అలా వారు చేసిన రాళ్ల దాడి వలన హ|జత్ అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్ రజి వీరమరణం పొందారు. వారి సమాధి మర్రు జ్జహ్‌రాన్‌లోనే ఉన్నది.

**(దాయిరే మాఅరుఫత్, సీరత్‌ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 7, పేజి 141, ప్రచురణ బజమే ఇక్బాల్, లాహౌర్ 2022)**

ఈ ఘటనను గూర్చి హ|జత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు ఇలా వ్రాసారు: " 7గురు అనుచరులు హతమార్చబడ్డారు. కేవలం ఖుబైబ్ బిన్ అద్ది రజి మరియు జైద్ బిన్ దసినహ్ మరియు మరొక అనుచరులు మాత్రమే మిగిలి ఉన్నారు. వాస్తవానికి అవిశ్వాసులు ముసల్మానులందరిని ప్రాణాలతో పట్టుకోవాలని భావించారు. అందుకే వారు మరల గట్టిగా అరిచారు. ఇప్పుడైన క్రిందికి రండి. మేము మీకు ఎలాంటి నష్టాన్ని కల్గజేయము. అని మాట ఇచ్చారు. ఈ సారి ఈ సాధారణ మనస్థత్వం గల ముసల్మానులు వారి మాటలను నమ్మి క్రిందికి వచ్చారు. కాని క్రిందికి రావడంతోనే అవిశ్వాసులు వారిని తమ విల్లుల దారములతో బంధించారు. ఆ క్రమంలో ఖుబైబ్ మరియు జైద్ రజిల మిత్రుడైన మరొక అనుచరుడు వారి పేరు చరిత్ర గ్రంథాలలో అబ్దుల్లాహ్ బిన్ తారీఖ్ అని పేర్కొన్నారు. వారు సహానం పట్టలేక పోయారు. అందుకే వారు ఇలా అన్నారు. ఇది మీ మొదటి మోసం. ఇక ముందు మీరు ఇంకా ఇలాంటి ఎన్ని మోసాలు చేస్తారో తెలియదు. ఆ తరువాత అబ్దుల్లాహ్ రజి వారితో పాటు వెళ్ళుటకు నిరాకరించారు. అందుకు అవిశ్వాసులు అబ్దుల్లాహ్ రజిను కొంత దూరం వరకు లాక్కుకెళ్ళిపోయారు. వారిని పిడిగుద్దులు గుద్దుతూ తీసుకవెళ్ళారు. ఆపై వారిని అక్కడే హతమార్చి పడేసారు. అప్పటి వరకే వారి ప్రతీకారం తీరిపోయింది కావున, ఇక ఖురైష్‌లను సంతోష పెట్టడం కోసం మరియు వారికి ప్రకటించిన బహుమానంను పొందడం కోసం ఖుబైబ్ మరియు జైద్ రజిలను మక్కాకు తీసుకవెళ్ళారు. అక్కడికి చేరుకున్న తరువాత వారి ఇరువురిని ఖురైష్‌లకు విక్రయించారు. ఈ క్రమంలో ఖుబైబ్ రజిను హారిస్ బిన్ ఆమిర్ బిన్ నౌఫిల్ కుమారులు కొనుగోలు చేశారు. ఎందుకనగా ఖుబైబ్ రజి బదర్ యుద్ధంలో హారిస్‌ను హతమార్చినారు. మరియు జైద్ రజిను సఫ్వాన్ బిన్ ఉమయ్య రజి కొనుగోలు చేశాడు. " **(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స), హ|జత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి.ఎం.ఏ పేజి 514)**

హ|జత్ ఖుబైబ్ బిన్ అద్ది రజి మరియు హ|జత్ జైద్ బిన్ దసినహ్ రజిలను అన్యారాధులు బంధించి మక్కాకు తీసుకవెళ్ళారు. మక్కా చేరుకున్న తరువాత ఆ ఇరువురు అనుచరులను విక్రయించారు. హారిస్ బిన్ ఆమిర్ కుమారులు ముందుగా ప్రస్తావించినట్లుగా ఖుబైబ్ రజిను కొనుగోలు చేశారు. తద్వారా వారు తమ తండ్రి హారిస్ మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నారు. హారిస్‌ను బదర్ యుద్ధంలో హ|జత్ ఖుబైబ్ రజి హతమార్చినారు. ఇబ్నే ఇస్‌హాక్ ప్రకారం చూసినచో హుజైర్ బిన్ అబూ ఇహాబ తమీమ్ హ|జత్ ఖుబైబ్ రజిను కొనుగోలు చేశారు. అతడు హారిస్ వారసుల మిత్రుడు. అతని నుండి హారిస్ కుమారుడైన ఉక్బా హ|జత్ ఖుబైబ్ రజిను కొనుగోలు చేశాడు. తద్వారా తన తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకోవా లనుకున్నాడు. అంతేగాకా ఉక్బా బిన్ హారిస హ|జత్ ఖుబైబ్ రజిను బనూ నజ్జార్ తెగ వారి నుండి కొనుగోలు చేశాడనికూడ చెప్పుకోవడం జరుగుతుంది. మరో కథనము ప్రకారం అబూ ఇహాబ్ , ఇక్రిమా బిన్ అబూ జహల్, అఖ్‌నస్ బిన్ షరీఖ్,

ఉబైదహ్ బిన్ హకీం, ఉమయ్య బిన్ అబూ ఉత్బా హజ్రమీ కుమారులు మరియు సఫ్వాన్ బిన్ ఉమయ్య మొ॥ వారు కలిసి హజ్రత్ ఖుబైబ్ రజిను కొనుగోలు చేశారని గలదు. వీరందరి తండ్రులు బదర్ యుద్ధంలో మరణించారు. వారందరు హజ్రత్ ఖుబైబ్ రజిను కొనుగోలు చేసి ఉక్బా బిన్ హారిస్‌కు అప్పగించారు. అతడు వీరిని తమ ఇంటిలో బంధించాడు.

**(అల్ ఇస్తియాబ్, భాగం2, పేజి 440-442, దారుల్ జీల్ బైరూత్ 1992)**

ఇబ్నే హష్షామ్ ఇలా పేర్కొన్నారు. వారు ఈ ఇరువును అనుచరులను అనగా హజ్రత్ ఖుబైబ్ రజి మరియు హజ్రత్ జైద్ బిన్ దసినహ్ రజిను మక్కాలో ఉన్నటు వంటి హుజైల్ ఖైదీలకు బదులుగా వారి మక్కా వారికి విక్రయించారు. మరొకకథనములో 50 ఒంటెలకు బదులుగా విక్రయించినట్లు గలదు. హజ్రత్ ఖుబైబ్ రజిను 50 ఒంటెలకు బదులుగా విక్రయించినట్లు గలదు. మరి కొన్ని కథనాలలో హజ్రత్ ఖుబైబ్ రజిను 100 ఒంటెలకు బదులుగా విక్రయించినట్లు గలదు. మరొక కథనములో 80 బంగారపు నాణేములకు బదులుగా విక్రయించినట్లు గలదు. వారిలో కొంత మంది ఖురైష్‌లు ఉన్నట్లుగా కూడ చెప్పుకుంటారు. వారు ఆ ఇరువురిని అనగా హజ్రత్ ఖుబైబ్ రజి మరియు జైద్ బిన్ దసినహ్ రజిలను తీసుకొని పవిత్ర నెలలో ఒకటైన జుల్ ఖాయిదా నెలలో మక్కాకు చేరుకోని ఖైదిగా బందించారు. అలా వారిని ఆ పవిత్ర నెలలు పూర్తి అయ్యేవరకు అలాగే బంధించారు.

**(ఇమ్తిఅల్ అస్మా భాగం 13, పేజి 275, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బైరూత్)(దాయిరే మాఅరిఫ్ సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 7, పేజి 142, ప్రచురణ బజమే ఇక్బాల్ లాహోర్ 2022) (సబీలుల్ హుదా వ ద్రిషాద్, సంపుటి 6, పేజి 41, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బైరూత్)**

గత జుమా ప్రసంగంలో పవిత్ర నెలలను గూర్చి వివరముగా చర్చించడం జరిగింది. ఇబ్నే ఇస్‌హాఖ్ మరియు ఇబ్నే సఅద్‌లు ఇలా తెలిపారు. హజ్రత్ జైద్ రజిను సఫ్వాన్ బిన్ ఉమయ్య కొనుగోలు చేశారు. తద్వారా తన తండ్రి ఉమయ్య బిన్ ఖలఫ్ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నారు. సఫ్వాన్ తరువాత ఇస్లాంను స్వీకరించాడు. అతడు జైద్‌రజిను బనూ జమఅ తెగవారి వద్ద ఖైదీ చేశాడు. మరొకకథనములో తన బానిస అయినా నిస్‌తాస్ ఇంట్లో బంధించినట్లు గలదు. పవిత్ర నెలలు ముగియగానే సఫ్వాన్ తన బానిస అయినా నిస్‌తాస్‌కు తన్‌ఈమ్ వైపు పంపాడు. తన్‌ఈమ్ మక్కా నుండి మదీనా మరియు సిరియా వైపు మూడు లేదా నాలుగు మైళ్ళ దూరంలో ఉన్నటు వంటి ఒక ప్రాంతం పేరు. మొత్తానికి హజ్రత్ జైద్‌రజిను హత్య చేయడం కోసం పవిత్ర నగరం నుండి బయటికి తీసుకవెళ్ళాడు. ఖురైష్ ప్రజలు కూడ గుమికూడారు. వారిలో అబూసఫ్వాన్ బిన్ హరబ్ కూడ ఉన్నాడు. వారిని హత్యచేయుటకు తీసుకవస్తున్న సమయంలో అబూ సుఫ్యాన్ వారితో ఇలా అన్నాడు. ఓ జైద్! నేను అల్లాహ్ ప్రమాణ పూర్తిగా చెబుతున్నాను. ఈ సమయంలో మా చేతిలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉన్నచో, మేము వారి తలను నరికివేసేవారము, బదులుగా నీవు నీ కుటుంబ సభ్యులతో నీ ఇంట్లో సంతోషంగా ఉండేవాడివి. నీకు ఇది ఇష్టం లేదా?. అందుకు హజ్రత్ జైద్ రజి ఇలా సమాధానం ఇచ్చారు. అల్లాహ్ ప్రమాణం! నేను నా ఇంట్లో నా భార్యపిల్లలతో ఉండగా, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇప్పుడు ఏ ఇంటి వద్ద ఉన్నరో అక్కడ హుజూర్ (స) ముళ్ళు గ్రుచ్చుకొని వారికి బాధ కల్గడాన్ని కూడ నేను ఇష్టపడను. అందుకు అబూసుఫ్యాన్ ఇలా అన్నాడు. ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రేమించినంతగా ప్రపంచంలో మరేవ్వరు కూడ మరెవ్వరని ప్రేమించడాన్ని నేను చూడలేదు.

మరల హజ్రత్ జైద్ రజిను నిస్‌తాస్ హత్య చేశాడు. మరొక కథనములో ఈ విధముగా గలదు. నిస్‌తాస్‌తో పాటు కొందరు ఖురైష్ యువకులు కూడ కలిసి జైద్ రజిపై బాణాలు వేశారు. ఫలితముగా వారు రజి వీరమరణం పొందారు. తరువాత ఈ నిస్‌తాస్ హంతకుడు ఇతడు కూడ ముసల్మానుడైనాడు. ఇబ్నే ఉక్బా ఇలా పేర్కొన్నాడు. జైద్ మరియు ఖుబైబ్ ఇరువురు ఒకే రోజు వీరమరణం పొందారు. ఏ రోజున వారు ఇరువురు అమరులైనారో ఆ రోజున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలియజేయడమైనది. అందుకు హుజూర్ (స) అలైకుమా స్సలాము అనగా మీ ఇరువురిపై కూడ శాంతి వర్షించునుగాకా! అని సమాధానం ఇచ్చారు.

**(సబీలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 42, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బైరూత్)(షరఅ జర్కాని సంపుటి 2, పేజి 493, బఅస ద్రజీఊ ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బైరూత్ 1998) (ఫ్రాంగ్ సీరత్, పేజి 77, ప్రచురణ జవార్ అకాదమి కరాచి)**

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజిగారు ఈ ఘటనను ఈ విధముగా పేర్కొన్నారు. “ సఫ్వాన్ బిన్ ఉమయ్య తన ఖైదీ జైద్ బిన్ దసినహ్‌ను పవిత్ర మక్కా నగరం నుండి బయటికి తీసుకవెళ్ళాడు. ఖురైష్ నాయకులందరు గుమిగూడినారు. బయటికి చేరుకున్న తరువాత సఫ్వాన్ తన బానిస అయినా నిస్‌తాస్‌తో జైద్ రజిను హత్యచేయమని ఆదేశించాడు. నిస్‌తాస్ ముందుకు వచ్చి ఖడ్గాన్ని ఎత్తాడు. ఆ సమయంలో అక్కడ ప్రేక్షకులుగా ఉన్నటువంటి మక్కా నాయకులలో ఒకరైన అబూ సుఫ్యాన్ బిన్ హరబ్ ముందుకు వచ్చి జైద్ తో ఇలా అన్నాడు. “ నిజం చెప్పు!. ఒకవేళ నీ స్థానంలో మా వద్ద ముహమ్మద్ (స) ఉండి, మేము వారిని హతమార్చేవారము, నీవు ప్రాణాలతో బయటపడి నీ కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపేవాడివి కదా?” . జైద్ రజి కన్నులలో రక్తం ప్రవహించింది. తీవ్ర ఆవేశంతో ఇలా అన్నారు. అబూ సుఫ్యాన్ ! నీవు ఏమి మాట్లాడుతున్నావు?. అల్లాహ్ ప్రమాణం! నా ప్రాణాలను కాపాడు స్థితిలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ముల్లు గ్రుచ్చుకోవడాన్ని కూడ నేను ఏ మాత్రం ఇష్టంలేదు. ” అబూ సుఫ్యాన్ నిర్భర్యంతరంగా ఇలా అన్నాడు. “ దేవుని ప్రమాణం!. ముహమ్మద్ (స) అనుచరులు ముహమ్మద్ (స)ను అభిమానించినంతగా మరే వ్యక్తులు మరెవ్వరిని అభిమానించినట్లుగా నేను ఎన్నడు చూడలేదు. ” ఆ తరువాత నిస్‌తాస్ జైద్ రజిను హతమార్చినాడు. ”

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స), హజ్రత్ సాహెబ్జాదహ్ మిర్జా బషీర్ అహ్మద్ రజి . ఎం.ఏ పేజి 516)**

ఈ వీరమరణపు ఘటనను గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా పేర్కొన్నారు. “ఆ ఘటనను చూడడానికి వచ్చినవారిలో మక్కా నాయకుడైన అబూ సుఫ్యాన్ కూడ వచ్చాడు. అతడు జైద్ రజిను ఉద్దేశించి ఇలా అడిగాడు. నీ స్థానంలో ముహమ్మద్ (స) ఉండి, నీవు నీ కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని నీకు అనిపించడం లేదా?. అందుకు జైద్ రజి ఆగ్రహంతో ఇలా సమాధానం ఇచ్చాడు. ఓ అబూ సుఫ్యాన్! నీవు ఏం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?. అల్లాహ్ ప్రమాణం! ఆo హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు మదీనా వీధులలో ముల్లు గ్రుచ్చుకోవడం కంటే నేను మరణించడమే ఉత్తమముగా భావిస్తాను. ఈ అంకిత భావంను చూసి అబూసుఫ్యాన్ కూడ చాలా ప్రభావితుడైనాడు. అతడు ఆశ్చర్యముతో జైద్ రజిను చూస్తూ, నెమ్మదించిన గొంతుతో ఇలా అన్నాడు. దేవుని ప్రమాణం! ముహమ్మద్ (స) అనుచరులు ముహమ్మద్ (స)ను అభిమానించినంతగా మరేవరు కూడ మరెవరిని అభిమానించడాన్ని నేను చూడలేదు. ” **(దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 262-263)**

ఒక చరిత్ర కారుడు హజ్రత్ ఖుబైబ్ రజి వీరమరణంను గూర్చి ఇలా పేర్కొన్నాడు. హజ్రత్ ఖుబైబ్ రజి హుజైర్ బిన్ అబూ ఇహాబ్ ఆధీనంలో హారిస్ బిన్ నౌఫిల్ కుమారుల ఇంట్లో ఉండేవారు. అతడు హజ్రత్ ఖుబైబ్ రజితో చాలా మూర్ఖత్వముగా వ్యవహరించేవాడు. అతని మూర్ఖత్వపు వ్యవహారాన్ని చూసిన హజ్రత్ ఖుబైబ్ రజి అతనితో ఒక గౌరవప్రదమైన జాతి తమ ఖైదీల పట్ల ఇలా దురుసుగా వ్యవహరించదు అని అన్నారు. ఆ మాట ఆ అవిశ్వాసునిపై చాలా ప్రభావాన్ని చూపింది. ఆ తరువాత నుండి అతడు హజ్రత్ ఖుబైబ్ రజితో చాలా మర్యాద పూర్వకముగా వ్యవహరించసాగాడు. ”

**(దాయిరే మాఅరుఫ్, సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 7, పేజి 144, ప్రచురణ బజమే ఇఖ్బాల్ లాహోర్ 2022)**

ఇబ్నే షఅబ్ ఇలా పేర్కొన్నాడు. ఉబైదుల్లాహ్ బిన్ ఇయాజ్ రజి నాతో ఇలా అన్నాడు. హారిస్ కుమార్తే వారికి ఈ విషయాన్ని తెల్పినది. అవిశ్వాసులు ఖుబైబ్ రజిను హతమార్చలని నిశ్చయించుకున్న తరువాత హజ్రత్ ఖుబైబ్ రజి గడ్డం చేసుకోవడం కోసం ఒక ఉస్త్రా (గడ్డం గీసుకునే కత్తి)ఇవ్వమని అడిగారు. అందుకు వారికి ఆ ఉస్త్రాను ఇవ్వడం జరిగింది. హారిస్ కుమార్తే మరల ఇలా తెల్పింది. ఆ క్రమంలో నాకు తెలియకుండానే నా కుమారుడు ఒకడు ఖుబైబ్ రజి వద్దకు వెళ్ళాడు. వారు ఆ బాలుడిని దగ్గరికి తీసుకున్నారు. నేను చూసే సమయానికి ఆ కుమారుడిని తన తొడపై కూర్చోబెట్టుకున్నారు. ఆ సమయంలో వారి చేతిలో ఆ ఉస్త్రా ఉన్నది. ఆ దృశ్యాన్ని చూసి నేను చాలా ఆందోళన చెందాను. కాని నా ఆందోళనను గమనించిన ఖుబైబ్ రజి ఇలా అన్నారు. నేను నీ కొడుకును చంపుతానని భయపడుతున్నావా?. నేను అలా చేయను. ముసల్మానులు చేసిన వాగ్దానానికి కట్టుబడి ఉంటారు కాని ఇతరులను ఏ విధముగా బాధించరు.

హారిస్ కుమార్తే ఇలా తెల్పింది. దేవుని ప్రమాణం! ఖుబైబ్ వంటి ఉత్తముడైన ఖైదీని నేను ఎక్కడ చూడలేదు. మరల ఇలా తెల్పింది. అల్లాహ్ ప్రమాణం! ఒకరోజు

నేను వారిని చూశాను. వారి చేతిలో ద్రాక్ష పండ్ల గుచ్ఛ ఉన్నది. ఆ పండ్లను వారు తింటున్నారు. పైగా వారు గొలుసులతో బంధించబడి ఉన్నారు. నిజానికి ఆ రోజులలో మక్కాలో అసలు ఎలాంటి ఫలములు అందుబాటులోనే లేవు. ఇది కేవలం అల్లాహ్ తాలా యొక్క అనుగ్రహం మాత్రమే. అల్లాహ్‌యే వారికి ఆ ఫలములను అనుగ్రహించాడు.

ఖురైష్‌లు వారిని పవిత్ర మక్కా నగరం నుండి బయటికి తీసుకవెళ్ళారు. అప్పుడు హజ్రత్ ఖుబైబ్ రజి వారిని రెండు రకాతుల నమాజ్ చేసుకోవడానికి అనుమతిని కోరారు. అందుకు వారు అనుమతిని కూడ ఇచ్చారు. వారు రజి రెండు రకాతులు నమాజ్ చదివారు. ఆపై ఇలా అన్నారు. ఇప్పుడు నేను చేసిన నమాజ్‌ను చూసి మీరు ఇతడు భయంతోనే ఇంత సుదీర్ఘమైన నమాజ్‌ను చదువుతున్నాడు అని మీరు ఎక్కడ ఆలోచిస్తారని నేను సుదీర్ఘమైన నమాజ్‌ను చదవలేదు. తొందరగానే పూర్తి చేసుకున్నాను. లేకపోతే నేను ఖచ్చితముగా సుదీర్ఘమైన నమాజ్‌ను చదివేవాడిని. అనగా ఒకవేళ నేను మరణం నుండి కాపాడుకోవడం కోసం ఇంత సుదీర్ఘమైన నమాజ్‌ను చదువుతున్నారని మీరు ఎక్కడ ఆలోచిస్తారనే భయంతోనే నేను నమాజ్‌ను చిన్నగా చదివాను. లేనిచో తప్పకుండా సుదీర్ఘమైన నమాజ్‌ను చదివేవాడిని. అందుకే నేను నమాజ్‌ను సుదీర్ఘముగా చదవలెదు. నేను ఎక్కడ మరణం భయంతో నమాజ్‌ను పొడిగిస్తున్నానో అని మీరు ఆలోచిస్తారు. మీరు నన్ను ప్రశాంతంగా ఉన్నట్లు చూసినచో నేను సుదీర్ఘమైన నమాజ్‌ను చదివేవాడిని. మొత్తానికి వారు రజి ఆ తరువాత అల్లాహ్ తాలాతో దుఆ చేశారు. ఇలా దుఆ చేశారు. ఓ అల్లాహ్! వారిని ఒక్కొక్కరిగా పట్టుకొని నాశనం చేయుము. అనగా శత్రువులను. శత్రువులకు వ్యతిరేకముగా దుఆ చేశారు. ఆ తరువాత హజ్రత్ ఖుబైబ్ రజి ఈ పంక్తులను చదివారు.

వలస్తు ఉబాలి హీన ఉఖ్‌తలు ముస్‌లిమన్
ఆలా అయ్యి షిఖ్ఖిన్ కాన లిల్లాహి మస్‌రఈ
వ జాలిక ఫీ జాతిల్ ఇలాహి వ ఇన్ య్యషా
యుబారిక్ అలా అవ్‌సాలి షిల్‌విన్ ముమజ్జఇ

నేను ముస్లింగా ఉన్న స్థితిలో హతమార్చబడుతున్నాను. కావున ఎటువైపు తిరిగి పడుతానే విషయంను గూర్చి నేను పట్టించుకోను. నేను పడిపోవడం అనేది అల్లాహ్ ప్రీతికొరకు మాత్రమే. ఒకవేళ అతడు కోరుకున్నచో ముక్కలు ముక్కలు చేయబడిన శరీరమును కూడ కలిపి మరల ప్రాణం పోయగలడు.

**(సహి బుఖారి, కితాబుల్ జిహాద్ వల్ సీర్ బాబ్ యస్తాసీరు ర్రజులు వ మన్ లం యస్తాసిర్... హదీస్ 3045)**

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి గారు ఖుబైబ్ రజి ఖైదీని గూర్చి, అక్కడి పరిస్థితులను గూర్చి ఈ విధముగా పేర్కొన్నారు. “ ప్రస్తుతం ఆ ఇద్దరు అనుచరులు ఖురైష్‌ల వద్ద బానిసలుగా ఖైదీ చేయబడ్డారు. ఒకరోజు ఖుబైబ్ రజి హారిస్ కుమార్తెతో తమ అవసరం నిమిత్తం ఒక ఉస్త్రాను అడిగారు. ఆమే వారి రజికు ఆ ఉస్త్రాను ఇచ్చింది. ఈ ఉస్త్రా ఖుబైబ్ రజి చేతిలో ఉన్నప్పుడు హారిస్ కుమార్తే యొక్క పసి బాలుడు ఆడుతూ ఆడుతూ ఖుబైబ్ రజి వద్దకు వచ్చాడు. ఖుబైబ్ రజి ఆ బాలుడిని తన తొడపై కూర్చోబెట్టుకున్నారు. ఆ బాలుడి తల్లి చూసినప్పుడు ఖుబైబ్ రజి చేతిలో ఉస్త్రా ఉన్నది. మరియు వారి రజి తొడపై బాలుడు కూర్చొని ఉన్నాడు. ఆ దృశ్యాన్ని చూసి ఆమే కంపిస్తూ లేచి నిలబడింది. ఆమే ముఖములో ఆందోళన కనిపించ సాగింది. ఖుబైబ్ రజి ఆమేను చూసి ఆమే ఆందోళనను అర్థం చేసుకోని ఇలా అన్నారు. “ నేను ఈ బాలుడిని హతమారుస్తానని నీవు భయపడుతున్నావా?. అలా ఆలోచించకు. ఇన్షా అల్లాహ్ నేను అలాంటి పని చేయను. ఆందోళనతో చిక్కుకపోయిన తల్లి యొక్క ముఖము ఖుబైబ్ రజి మాటలతో ఆనందంతో నిండిపోయింది. ఆ మహిళ హజ్రత్ ఖుబైబ్ రజి గారి ఉన్నత సుగుణాలను చూసి చాలా ప్రభావితురాలైనది. ఆ తరువాత ఆమే ఎల్లప్పుడు “ ఖుబైబ్ వంటి మంచి గుణం ఉన్నటు వంటి ఖైదిని ఎన్నడు చూడలేదు.” అని చెప్పేవారు. మరల వారు ఇలా తెలిపారు. ఒకరోజు నేను చూశాను. హజ్రత్ ఖుబైబ్ రజి చేతిలో ఒక ద్రాక్ష గుచ్ఛ ఉన్నది. ఆ గుచ్ఛ నుండి వారు ఒక్కొక్క ద్రాక్ష పండు తెంపుకొని తింటున్నారు. నిజానికి ఆ రోజులలో మక్కా నగరంలో ఎక్కడ కూడ ద్రాక్ష పండ్ల ఆనావాళ్ళే లేవు. ఆ సమయంలో ఖుబైబ్ రజి గొలుసులతో బంధించబడి ఉన్నారు. మరల ఆమే ఇలా తెల్పింది. అది కేవలం అల్లాహ్ తాలా యొక్క అనుగ్రహ సంపదయే. ఖుబైబ్ రజికు అందించబడేది. ”

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) హజ్రత్ సాహెబ్జాదహ్ మిర్జా బషీర్ అహ్మద్ రజి ఎం.ఏ పేజి 514-515)**

మరొక కథనములో ఈ విధముగా గలదు. హజ్రత్ ఖుబైబ్ బిన్ అద్ది రజి ఖైది ఘటనను గూర్చి ఇలా లిఖించబడింది. మావియ్య, హుజైర్ బిన్ అబూ ఇహాబ్ యొక్క స్వతంత్రం పొందిన బానిసరాలు. మక్కాలోని వారి ఇంటిలోనే హజ్రత్ ఖుబైబ్ బిన్ అద్ది రజి ఖైదీ చేయబడ్డారు. తద్వారా పవిత్ర నెలలు పూర్తికాగానే వారి రజిని హతమార్చాలని నిశ్చయించుకున్నారు. మావియ్య తరువాత కాలంలో ఇస్లాంను స్వీకరించింది. ఆపై ఇస్లాంపై నిలకడగా కొనసాగింది. మావియ్య తరువాత కాలంలో ఈ ఘటనను గూర్చి ఇలా వివరించింది. అల్లాహ్ ప్రమాణం! హజ్రత్ ఖుబైబ్ రజిను మించిన మరొక ఉత్తమ వ్యక్తిని నేను చూడలేదు. నేను వారిని తలుపుల మధ్య ఉన్నటు వంటి ఖాళిల మధ్యలో నుండి చూశాను. వారు గొలుసులతో బంధించబడి ఉన్నారు. నాకు తెలిసినంత వరకు ఆ సమయంలో ప్రపంచంలో ఎక్కడ కూడ ద్రాక్ష పండ్లు అందుబాటులో లేవు. అనగా ఆ ప్రాంతంలో ఎక్కడ కూడ ద్రాక్ష పండ్లు లేకుండెను. ఆ ప్రాంతంలో ఎక్కడ కూడ ద్రాక్ష పండ్లు అమ్మబడేవి కాదు. కాని హజ్రత్ ఖుబైబ్ రజి చేతిలో ద్రాక్ష పండ్ల గ్రుచ్ఛ కనిపించేది. అది వారి తలకు సమానంగా ఉండేది. అనగా చాలా పొడుగ్గా ఉండేది. ఒకసారి రెండు సార్లు కాదు. వారు అనేకసార్లు ఆ పండ్లను తినుచుండగా చూశాను. అది అల్లాహ్ తాలా అనుగ్రహ సంపద కాకుండా మరేదియును కాదు. హజ్రత్ ఖుబైబ్ రజి తహాజ్జుద్ నమాజ్ తరువాత ఖుర్‌ఆన్ చదివేవారు. మహిళలు ఖుర్‌ఆన్ పారాయణంను విని ఏడ్చేవారు. వారికి హజ్రత్ ఖుబైబ్‌రజిను చూసి జాలివేసేది. మరల ఇలా తెల్పింది. ఒకరోజు నేను వారితో ఓ ఖుబైబ్ రజి! నీకు ఏమైన కావాలా? అని అడిగాను. అందుకు వారు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. హాం చల్లటి నీటిని త్రాగుటకు ఇవ్వండి అని అడిగారు. నాకు విగ్రహాల పేరుతో కోసిన మాంసంను ఎట్టి పరిస్థితులలో ఇవ్వకుము. మీరు నాకు ఇచ్చే ఆహారంలో మాంసం విగ్రహాల పేరుతో కోసినదై ఉండకూడదు. మూడవ విషయమేమనగా, ప్రజలు నన్ను చంపాలని నిశ్చయించుకున్నప్పుడు నాకు ఆ విషయాన్ని తెల్పుము. కొన్ని రోజుల పవిత్ర నెలలు పూర్తి కాగానే ప్రజలు హజ్రత్ ఖుబైబ్ రజిను చంపడానికి నిర్ణయించుకున్నారు. మరల ఇలా తెల్పినది. నేను వారి వద్దకు వెళ్ళి ఆ విషయాన్ని తెలియజేశాను. మరల ఇలా తెల్పింది. అల్లాహ్ ప్రమాణం! వారు తమ మరణం పట్ల ఎలాంటి చింతనను కల్గిలేకుండెను. వారు నాతో ఇలా అన్నారు. నాకు ఒక ఉస్త్రాను తీసుకవచ్చి ఇవ్వుము. నేను నా పనిని చేసుకుంటాను. మరల ఆమే ఇలా తెల్పినది. నేను నా కుమారుడు అబూ హుస్సైన్ చేతికి ఆ ఉస్త్రాను ఇచ్చి పంపాను. కథకుడు ఇలా తెలిపాడు. ఆ బాలుడు ఆమే స్వంత కుమారుడు కాదు. మావియ్య కేవలం అతనిని పెంచిపెద్దచేయమని అప్పగించాడు. మొత్తానికి ఆ బాలుడు వారి వద్దకు వెళ్ళాడు. మరల ఇలా తెల్పినది. నా మనస్సులో ఒక సంకోచం ఏర్పడింది. అల్లాహ్ ప్రమాణం! ఖుబైబ్ తన ప్రతీకారంను తీర్చుకున్నాడు. నా కుమారుడు ఇప్పుడు అతని వద్ద ఉన్నాడు. ఉస్త్రా ఖుబైబ్ రజి చేతిలో ఉన్నది. వారు తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటారు. ఆపై ఇలా అంటాడు. ఒక పురుషుడికి బదులుగా మరొక పురుషుడు. అలా నేను ప్రతీకారం తీర్చుకున్నాను అని సమాధానం ఇవ్వవచ్చును. మరల నా కుమారుడు ఉస్త్రా తీసుకొని వారి వద్దకు చేరుకున్నప్పుడు ఖుబైబ్ రజి నవ్వుచూ ఆ బాలుడితో ఇలా అన్నారు. నీవు చాలా ధైర్యవంతుడివి. నీ తల్లికి నేను ద్రోహం చేస్తాననే భయం రాలేదా?. నీ చేతిలోనే నాకు ఉస్త్రాను పంపించింది. నిజానికి మీరు నన్ను చంపాలని నిశ్చయించుకున్నారు. హజ్రత్ మావియ్య ఇలా తెల్పినది. ఖుబైబ్ రజి గారి మాటలను నేను వింటున్నాను. నేను ఇలా అన్నాను. ఓ ఖుబైబ్! నేను అల్లాహ్ అభయం వలన నీ విషయంలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్నాను. నేను నీ ఆరాధ్యదైవంపై విశ్వాసంతో ఉన్నందునే నా కుమారుడి చేతిలో నీకు ఉస్త్రాను ఇచ్చి పంపాను. అంతేగాని దానితో నీవు నా కుమారుడిని చంపడానికి కాదు. హజ్రత్ ఖుబైబ్ రజి ఇలా అన్నారు. నేను అలాంటి వాడిని కాదు. నీ కుమారుడిని చంపను. మేము మాధర్మంలో ద్రోహంను సమంజసంగా భావించము. మరల ఇలా తెలిపారు. నేను ఖుబైబ్ రజితో ప్రజలు రేపు ఉదయం నిన్ను తీసుకవెళ్ళి చంపబోతున్నారు అనే విషయాన్ని తెలిపాను. ఆ తరువాత ఇలా జరిగింది. మరుసటి రోజున ప్రజలు వారిని గొలుసులతో బందించి తన్‌ఈమ్ ప్రాంతానికి తీసుకవెళ్ళారు. ముందుగా తెల్పినట్లుగా ఈ ప్రాంతం మక్కా నుండి సుమారు 3 మైళ్ళ దూరంలో ఉంటుంది. ఖుబైబ్ రజి మరణాన్ని చూడడానికి మహిళలు, బానిసలు, చాలా మంది అక్కడికి చేరుకున్నారు. ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నవారు తమ కన్నులను చల్లబర్చుకోవడం కోసం, ఎవరైతే ప్రతీకారం తీర్చుకోవాలనుకోవడం లేదో వారు మాత్రం ఇస్లాం మరియు ముసల్మానులకు వ్యతిరేకముగా తమ వ్యతిరేకతను ప్రదర్శించడానికి, ఆనందించడానికి, హజ్రత్ ఖుబైబ్ రజిను ఎలా చంపుతారో చూడడానికి అక్కడికి చేరుకున్నారు. ఆ తరువాత హజ్రత్ ఖుబైబ్ రజిను జైద్‌బిన్ దసినహ్ రజిను తీసుకొని తన్‌ఈమ్ ప్రాంతానికి చేరుకున్నారు. అన్యారాధులు పొడువాటి కర్రను సిద్ధం చేసి

దానిని భూమిలో నాటినారు. ప్రజలు హజ్రత్ ఖుబైబ్ రజిను ఆ కర్ర వద్దకు తీసుకువెళ్ళినప్పుడు హజ్రత్ ఖుబైబ్ రజి వారిని ఇలా అడిగారు. నాకు రెండు రకాతుల నమాజ్ చేసుకోవడానికి అనుమతిని ఇస్తారా?. ప్రజలు ఇస్తాము అని సమాధానం ఇచ్చారు. హజ్రత్ ఖుబైబ్ రజి రెండు రకాతుల నమాజ్‌ను సంక్షిప్తముగా చదివారు. నమాజ్‌ను సుదీర్ఘముగా చదవలేదు.

**(అత్తభ్ఖాతుల్ కుబ్రా, భాగం 8, పేజి 399, దారుల్ అహ్యా ఉల్ రాసుల్ అరబి బేహ్రూత్)( సహీ బుఖారి, కితాబుల్ జిహాద్, వ స్సీర్, బాబ్ హల్ యస్తాసీరు ర్రజుల్ వ మన్ లం యస్తాసిర్.. హదీస్ 3045) (ఉసదుల్ ఘాబా, సంపుటి 1, పేజి 683, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బేహ్రూత్ 2003)**

నేను ముందుగా తెల్పినట్లుగా నమాజ్‌ను సుదీర్ఘముగా ఎందుకు చదవలేదు అనగా, మరణం నుండి తప్పించుకోవడానికే ఇంత సుదీర్ఘముగా నమాజ్ చదువుతున్నారు అని ప్రజలు ఎక్కడ భావిస్తారో అనే ఉద్దేశంతోనే. ఇబ్నే సఅద్ ఆధారముగా ఏ కథనము అయితే ప్రస్తావించ బడిందో, దాని ప్రకారం మావియ్యా హుజైర్ బిన్ అబూ ఇహాబ్ యొక్క స్వతంత్రం పొందిన బానిసరాలు. ఆమే ఇంటిలోనే హజ్రత్ ఖుబైబ్ రజి ఖైదిగా ఉన్నారు. అల్లామా ఇబ్నే అబ్దుల్ బర్రి ప్రకారం హజ్రత్ ఖుబైబ్ రజి, ఉఖ్బా ఇంట్లో ఖైది చేయబడ్డారు. ఉక్బా భార్య వారికి ప్రతిరోజు భోజనం పంపించేది. భోజన సమయంలో వారిని విడిచిపెట్టేవారు. **(అల్ ఇస్తియాబ్, భాగం 2, పేజి 442, దారుల్ జీల్ బేహ్రూత్ 1992)**

మొత్తానికి వారు చేసిన త్యాగాలు ఇవి. మరణం పట్ల ఏ మాత్రం భయపడేవారు కాదు. ఇస్లాం కొరకు ప్రాణాలను అర్పించుటకు ఈ అనుచరులు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండేవారు. ఈ సరియ్యాను గూర్చిన ప్రస్తావన ఇంకా మిగిలి ఉన్నది. ఇన్షా అల్లాహ్ తదుపరి జుమాలో ప్రస్తావించుతాను.

---

కొన్ని రోజుల క్రిందట అల్ ఆయాతు బాదల్ మిఅతాని అనే హదీసులో గల అంతరంగికం అనగా 13 వ శతాబ్దపు చివరలో మసీహ్ మౌవూద్ అవతరించును అను హదీసు భవములో కూడ నన్ను గూర్చి ఏమైన కలదా? అని నేను పరిశీలించగా నాకు ఆధ్యాత్మిక స్వప్నం ద్వారా క్రింద పేర్కొనబడిన ఈ నామము వైపు నా దృష్టిని మరల్చబడినది. చూడు 13వ శతాబ్దములో అవతరించబోయే మసీహ్ ఇతనే. ప్రారంభము నుండే మేము ఈ తేదినే నామములో అంతర్లీనం చేయడమైనది. ఆ నామము గులాం అహ్మద్ ఖాదియాన్. ఆ నామపు సంఖ్యల మొత్తం 1300. అంతేగాక ఈ ఖాదియాన్ ప్రాంతంలో నాకు తప్ప మరే వ్యక్తికి గులాం అహ్మద్ అను నామము లేదు. అంతే కాకుండ ఈ సమయంలో ఈ ప్రపంచం మొత్తంలో నా ఒక్కడికి తప్ప మరెవరికి గులాం అహ్మద్ ఖాదియాని అనే నామము లేదని నా హృదయంలో నాటబడినది. అంతేగాకా అల్లాహ్ తన అలవాటు ప్రకారం అనేక సంధర్భాలలో ఈ సేవకునిపై అధిక సంఖ్యలో రహస్యాలను, సంఖ్యా శాస్త్రములను, పదాలను బహిర్గత పరచెను. ఒకసారి నేను ఆదమ్ జన్మ సంవత్సరము గూర్చి ఆలోచించుచుండగా సూర-తుల్-అసర్ లోగల పదాల సంఖ్యను గమనించినచో అందులో నుండే జన్మ సంవత్సరము వస్తుందని నాకు సూచించడం జరిగినది.

మరొకసారి నేను నా గృహముతో అనుసంధానం చేయబడిన మస్జిద్ యొక్క తేదిని దైవ వాణి ద్వారా కనుగొన దల్చగా ముబారకున్ వ ముబారికున్ వ కుల్లు అమ్‌రిమ్ ముబారకిన్ యుజ్అలు ఫీహి అని దైవవాణి అందినది. నేను ఈ సంచికలో ఏ మస్జిద్ ను గూర్చి వ్రాసినానో ఆ మస్జిద్యే ఇది. నా గృహము ఈ మస్జిద్ యొక్క తూర్పు దిశలోని జన సమూహము యొక్క చివరి మూలన మస్జిద్‌కు సమీపంలో, మరియు తూర్పు దిశలోనున్న మినార్ క్రింద మన మహాప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం తెల్పినట్లుగా యున్నది.

ఇక రెండు రోజుల క్రిందటి విషయమునే చూడండి, ఒక వ్యక్తి మరణం గూర్చి సంఖ్యా శాస్త్రము ద్వారా నాకు సందేశమివ్వడం జరిగినది. దాని సారాంశము ఏమనగా కల్బున్ యమూతు అలా కల్బిన్ అనగా అతను కుక్క (12వ పేజిలో)

| అహ్దీస్ బోధనలు | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

## హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో అనుచరుల ఎనలేని ప్రేమ,

---

అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇట్లు నుడివెను.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اجْتَنِبُوا كَثِيرًا مِّنَ الظَّنِّ إِنَّ بَعْضَ الظَّنِّ إِثْمٌ (الحجرات 13)

(అల్ హుజరాత్ : 12) ఓ విశ్వాసులారా! దురాలోచన నుండి సదా దూరముండుము. నిశ్చయముగా కొన్ని దురాలోచనలు పాపములు.

దీని గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి. "మానవుడు దురాలోచనలు, అనుమానాలకు పాల్పడినప్పుడు పీడనము మొదలగును. మంచిగా ఆలోచించినచో కొంత దానము చేయు అనుగ్రహము కలుగును. మొదటి అడుగులోనే పొరపాటు చేసినచో గమ్యం వరకు చేరుకొనుట కష్టమగును." ఇట్లనిరి. "దురాలోచన చాలా దుష్టమైన విషయము. అనేక సత్కార్యముల నుండి మానవున్ని దూరము చేయును. అది పెనుభూతమగుచు తుదకు దేవుని గురించి కూడ అతడు అనుమానపడడం మొదలు పెట్టును."

(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 375, ఎడీషన్ 2003 ముద్రణ రబ్వా)

మరో చోట వారిట్లనిరి.

"ఇతరుని అంతరంగికము గురించి మనము ఎట్టి అధికారము కలిగి లేము." (అనగా మనము ఎవరి హృదయము వరకు చేరుకోలేము.) ఇటువంటి అధికారము పాపము. మానవుడు ఒక వ్యక్తిని దుష్టుడిగా బావించును, అనంతరం తాను అతని కంటే హీనముగా మారును. ....త్వరగా అనుమానించుట మంచిది కాదు." (అనుమానించుటలో త్వరపడుట మంచిది కాదు) "మానవులపై అధికారము చెలాయించుట ఒక సున్నితమైన విషయము." (అనగా మేము ప్రజల హృదయముల వరకు చేరుకోగలమని భావించుట చాలా సున్నితమైన, అతి నాజూకైన విషయము.) "ఇది ఎందుకు సున్నితమైన, నాజూకైన విషయమనగా" ఇట్లనిరి. సందేశహరులను, వారి కుటుంబ సభ్యులను అనుమానించినందున అనేక జాతులు నాశనమైనవి."

(మల్ఫూజాత్ సంపుటి 2 పుట 568,569, ఎడీషన్ 2003 ముద్రణ రబ్వా)

ఇంతకు ముందు ఉపదేశించినట్ల తరువాత అల్లాహ్ తాలాపై కూడ అనుమానము మొదలగును.

ఇటువంటి అనుమానమునకు పాల్పడే వారి గురించే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పలు సంఘటనలను తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. ప్రజలు సందేశహరులను, వారి కుటుంబమును అనుమానించినారని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపదేశించిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు తమ కాలములో అందరి కంటే ఎక్కువ ఈ విషయమును ఎదుర్కొనిరి. అందుకే ఒక చోట వారిట్లనిరి. "అల్లాహ్ తఆలా నన్ను ఖలీఫా చేసెను. అతడే సదా నాకు సహకరించెను. సదా ఆకాశము నుండి నాకు సహాయము చేయుటకు దేవదూతలను పంపినాడను విషయమును చూపుకోల్పోయిన లేదా జన్మతః అంధుడైన వ్యక్తి మాత్రమే నిరాకరించును." విమర్శించు వారిని అంటున్నారు. "మీరు కూడ ఇప్పుడు విమర్శించి, ఈ విమర్శల ఫలితము ఎలా తేలునో చూడవచ్చును. ఇటువంటి విమర్శలు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై కూడ చేయబడినవి. ఒక సారి ఇటువంటి విమర్శయే ఒకరు చేయగా వారిట్లనిరి. (అనగా చందా ఇచ్చుట గురించి) ఇక ముందు జమాఅత్ కొరకు ఒక్క పైసా మీరు చందా ఇచ్చుట కూడ నిషేధము. అప్పుడు దైవ జమాఅత్‌నకు ఏ నష్టము కలుగునో చూడుము." ఇట్లనిరి. నేను వారితో అదే తరహాలో అంటున్నాను. ఇక ముందు జమాఅత్ సహాయమునకు ఒక్క పైసా మీరు చందా ఇచ్చుట కూడ నిషేధము. (తప్పుడు మార్గములో వినియోగించుచున్నారని, వర్తమాన ఖలీఫా తప్పుడు మార్గములో వినియోగించుచున్నారని విమర్శించే వారితో ఇట్లనిరి) "కఠిన పదములను వినియోగించుట నా అలవాటు కాదు. అయినను

| అహ్దీస్ బోధనలు | **"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన మునల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చోవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

మీలో ఇసుమంత మంచితనము యున్నను ఒక్క పైసా కూడ జమాఅత్‌నకు చందా ఇవ్వకుమని నేనంటున్నాను. జమాఅత్ పని జరుగుతుందా లేదా అప్పుడు చూడుము. అల్లాహ్ తఆలా పరోక్షముగా నాకు సహకరించును. విధేయులైన వారికి అల్లాహ్ పరోక్షముగా సువార్త వాణి చేయును. వారు ఈ జమాఅత్‌నకు తమ ధనమును త్యాగము చేయుటను గర్వముగా భావింతురు.” వారిట్లనిరి. “మా ఈ స్థాయి వైపు సంజ్ఞ చేయుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపినది మీకు గుర్తు లేదా” (అనగా తమ సంతానము అనగా ఐదుగురు పిల్లల గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.) “స్మశానములో సమాధి అగుట గురించి నా భార్య, పిల్లలకు అల్లాహ్ తఆలా మినహాయింపు ఇచ్చెను.” (హజ్రత్ ఉమ్ముల్ మొమినీన్, వారి ఐదుగురు పిల్లలు) “వారు వసియ్యత్ చేయకుండానే బహిష్తి మఖ్బరహ్‌లో ప్రవేశింతురు. ఈ విషయము పట్ల విమర్శ చేయు వ్యక్తి దాంబికుడగును.” ఇట్లనిరి. “మేము రూపాయలు ఆర్జించేవారము అయినచో ప్రత్యేక గుర్తింపు ఎందుకు ప్రసాదింతురు. వసియ్యత్ చేయకుండానే బహిష్తి మఖ్బరహ్‌లో ప్రవేశించు అనుమతి ఎందుకు ఇత్తురు. మాపై దాడి చేయు వ్యక్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై దాడి చేయును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై దాడి చేయు వ్యక్తి అల్లాహ్ తఆలాపై దాడి చేయును.

నాకింకా మంచిగా గుర్తున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సారి తోటకు వెళ్లిరి. అప్పుడు వారిట్లనిరి. నాకిక్కడ వెండితో చేసిన సమాధులు చూపబడినవి. ఇవి నీ, నీ కుటుంబ సభ్యుల సమాధులని ఒక దైవదూత నాతో అనెను. అందుకే ఆ భాగము వారి కుటుంబము కొరకు కేటాయించబడినది. కాని ఈ సత్యస్వప్నము ఇలా ముద్రించబడి లేదు.” హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ ఇట్లనిరి. ఈ సత్యస్వప్నము ఈ విధముగా ముద్రించబడి లేదు. “కాని ఇలాగే చెప్పినట్లు నాకు గుర్తున్నది. అల్లాహ్ తఆలా మా సమాధులను కూడ వెండితో చేసి చూపెను. వీరు తమ జీవితములో ప్రజల ధనము ఆర్జించుచున్నారని మీరందురు. మేము వారు మరణించిన తర్వాత కూడ వారి ద్వారా ప్రజలకు లబ్ది కలిగింతుమని ప్రజలకు చెప్పెను.” మేము లబ్ది కలిగింతుమని అల్లాహ్ చెప్పెను. “అల్లాహ్ మా మట్టిని కూడ వెండిగా మార్చుచున్నాడు. మీరు విమర్శల వలన మీ వెండిని కూడ మట్టిగా చేయుచున్నారు.”

ఇట్లనిరి. “సాధారణముగా దాంబికునికి గుప్తముగా మాట్లాడే అలవాటు యుండును. అందుకే నేను బహిరంగంగా ఈ విషయమును ప్రస్తావించితిని. లేనిచో అల్లాహ్ తఆలా కొరకు చందా ఇచ్చి నేను ఇంత చందా ఇచ్చినానని చెప్పుటకు నాకు సిగ్గు కలుగును.” కాని వారి కాలములో ఒక ప్రశ్న లేవనెత్తబడెను. నేను చెప్పినట్లు అందరి కంటే ఎక్కువ వారు వ్యతిరేకులను, దాంబికులను ఎదుర్కొనిరి. వాస్తవానికి ఇప్పుడు ఎవరో ఒకరు ప్రశ్న లేవనెత్తుచుందురు. కాని ఆ కాలములో అధికముగా యుండెను. ఇట్లనిరి. “ఒక ప్రశ్న లేవనెత్తినందున విధి లేక నేను చెప్పవలసి వచ్చెను. మొత్తం కుటుంబం చందా కలిపినచో నేను ఆర్జించినానని చెప్పుచున్న దాని కంటే మేమిచ్చిన చందా ఐదు రెట్లు ఎక్కువే అగును. నా భార్య, పిల్లల ద్వారా ఖజానాలో కట్టిన నగదు కూడ దాని కంటే ఎక్కువే యుండును. మేము ఐదు రెట్లు నగదును దాని ఐదవ భాగమును ఆర్జించుటకు కట్టినామని ఏ వివేకి భావించదని నేను అనుకుంటున్నాను. విమర్శించు వారు అల్లాహ్‌తో భయపడవలెను. వారి విశ్వాసము అంతమై, నాస్తికులుగా మారి ధర్మ భ్రష్టులు కాక ముందే తమ సంస్కరణ వైపు దృష్టి సారించవలెను.”

(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 18 పుట 188-189)

నేను చెప్పినట్లు ఇటువంటి వారు ప్రతి కాలములో యుందురు. కాని వారికి చాలా ఎక్కువ ఎదుర్కొనవలసి వచ్చెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాంలో కూడ ఈ విమర్శ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై చేయబడినది. దీని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. “మాతో విడిపోయిన వారిలో తమ సోదరులను అనుమానించే అలవాటు కూడ యుండెను. దీని ఫలితమేమైనదనగా జమాఅత్ ధనమును వారు (అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం) స్వంత ఖర్చులకు వినియోగించుచున్నారని వారు విమర్శించిరి. హజ్రత్ గారికి తుది సమయములో ఈ విషయము తెలిసెను.” హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నకు తమ జీవిత తుది రోజులలో ఈ విషయము తెలిసెను. “వారు నాతో (అనగా హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హుతో) ఇట్లనిరి. “అతిథి గృహము కొరకు వచ్చే ధనమును నేను నా స్వంత ఖర్చులకు వినియోగించుచున్నాని వీరు భావించెదరు. కాని నాకు స్వంత ఖర్చులకు ప్రజలు సమర్పించే కానుకల (అనగా వారు తమ స్వంత ఖర్చులకు వినియోగించుటకు వచ్చిన వాటి) నుండి నేను అతిథి గృహము కొరకు ఖర్చు చేయుచున్నాననే విషయము వీరికి తెలియదు.” హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. నేను వారి మనీ ఆర్డర్లను తీసుకొని వచ్చేవాడిని. సత్రమునకు నగదు చాలా తక్కువ వచ్చేది, ఎంత తక్కువ అనగా దానితో పని కొనసాగదని నాకు తెలుసు. హజ్రత్ గారు నాతో ఇట్లనిరి. సత్రము ఏర్పాట్లను నేను వీరికి అప్పగించినచో (అనగా విమర్శించే వారు లేదా సంస్థలో తమను తాము నాయకులుగా భావించేవారు) వీరెన్నడు దాని ఖర్చులను పూర్తి చేయలేరు. కనుక అటులనే జరిగెను. ఇప్పటి వరకు అనుమానపు ఫలితమును అనుభవించవలసి వచ్చుచున్నది. సత్రము ఫండు ఎల్లప్పుడు రుణ భారముతో యుండును.”

(అల్‌హకమ్ జూబ్లీ నం. 28 డిశంబర్ 1939 పుట 13 సంపుటి 12 నం.31-40)

మేము చాలా మంచిగా ఏర్పాటు చేయగలమని భావించేవారి అనుమాన ఫలితముగా సుదీర్ఘ కాలము వరకు వారు అనుభవించవలసి వచ్చినది. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆలు జమాఅత్ తోడుండెను. ఇప్పుడు జమాఅత్‌నకు లభించిన సౌకర్యము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆల ఫలితమే తప్ప ఎవరి వ్యక్తిగత ప్రయత్నముల ఫలితము కాదు. నేడు దైవానుగ్రహముతో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతిథి గృహము కూడ ప్రపంచములోని ప్రతి దేశములో కొనసాగుచున్నది.

ఆధ్యాత్మికతతో సంబంధమున్న మరో సంఘటన ఇట్లు గలదు. సందేశహరుల జీవితము, వారి తర్వాతి జీవితము, సందేశహరుల హయాంలో జమాఅత్ స్థితి, వారి తర్వాత జమాఅత్ స్థితికి సంబంధించిన ఒక సంఘటన తెలిపెదను. ప్రపంచములో ఆధ్యాత్మిక క్షీణతను సవరించుటకు, ప్రజలలో ఆధ్యాత్మికముగా ఏర్పడిన బలహీనతలను దూరము చేయుటకు సందేశహరులను అల్లాహ్ ప్రపంచమునకు పంపును. ప్రజలను ఆధ్యాత్మిక ప్రగతి వరకు తీసుకెళ్ళుటకు సందేశహరులు అవతరింతురు. కాని తర్వాత సందేశహరులను విశ్వసించే వారి సంఖ్య పెరిగిన కొద్ది, వారిని విశ్వసించే వారి ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు ప్రాపంచిక అభివృద్ధి కూడ వారికి లభించును. వాస్తవానికి ఇహలోక, ప్రాపంచిక అభివృద్ధి ప్రమాణము సందేశహరుని మరణము తర్వాత చాలా అధికమగును. అల్లాహ్ తఆలా కృపానుసారము సందేశహరుల జీవితములోను, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌లోను మనము ఇదే చూచుచున్నాము. కాని ఆధ్యాత్మికముగా సందేశహరుని కాలము ఎంత గొప్ప స్థాయి కలిగియుండునో వారి తర్వాతి కాలము అంత గొప్ప స్థాయి కలిగియుండదు. ఆధ్యాత్మిక ప్రగతి సందేశహరుని కాలములో చాలా పెరిగియుండగా, ప్రాపంచిక ప్రగతి చాలా తక్కువ యుండును. అనంతరం అల్లాహ్ తఆలా వాగ్దానముల మేరకు ప్రాపంచిక ప్రగతి లభించును. కాని ఆధ్యాత్మికతలో తగ్గుదల ఏర్పడును.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఒక చోట ఈ విషయమును వివరించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సంఘటనను ప్రస్తావించిరి. ఇట్లనిరి. “సందేశహరుని మరణము వెంటనే ఆధ్యాత్మికముగా రాత్రి కాలము మొదలగును. కాని ఇహలోక పరంగా సందేశహరుని మరణము తర్వాత సూర్యోదయమును సూచించును. సూర్యోదయమనగా వెంటనే బాహ్య అభివృద్ధి దృశ్యము కనిపించుట మొదలగును. ఇటులనే రసూలె కరీం

| **వర్తమాన ఖలీఫా వాఖ్యములు** | **“అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గే ఆందోళన కూడ దూరం కాదు.” (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*



సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో సంభవించినది. ఇటులనే మసీహ్ నాస్రీ, మూసా కాలములో సంభవించెను. అదే విధముగా ఇప్పుడు హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కాలములో జరిగినది. వారి కాలములో జరిగిన తుది సభలో ఏడు వందల మంది పాల్గొనిరి."

(అప్పుడు హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపినది వినదగినది.) హ|జ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. "నాకు గుర్తున్నది. వారు విహారము కొరకు బయటికి వెళ్ళిరి. రేతిఛల్లలో మర్రి చెట్టు దగ్గర ప్రజల పెద్ద సమూహమును చూచి హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మా పని ముగిసినదని తెలియుచున్నది. ఎందుకనగా ఇప్పుడు విజయము, సఫలమగు సంకేతములు బహిర్గతమైనవి. ఇప్పుడు మా సభలో పాల్గొనుటకు ఏడు వందల మంది వచ్చిరి." (ఎంత మంది వచ్చినారనగా మా పని ముగిసినట్లు కనిపించుచున్నదని వారనిరి.) "ఇది ఎంత పెద్ద విజయమనగా అల్లాహ్ తఆలా నన్ను ఏ కార్యమునకు పంపెనో అది పూర్తి అయినట్లు కనిపించుచున్నది. ఇప్పుడు అహ్మదియ్యత్‌ను ఎవరు అంతము చేయలేరు." (తఫ్సీరె కబీర్ సంపుటి 9 పుట 340)

ఇలా హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి. హ|జ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఇది అల్లాహ్ తఆలా మీద వారికి గల నమ్మకము, విశ్వాసము. ఏడు వందల మంది సభలో పాల్గొనడానికి రాగానే ఇప్పుడు అహ్మదియ్యత్‌ను ఎవరు అంతము చేయలేరని అనిరి. ఇప్పుడు అల్లాహ్ తఆలా దయానుసారము ప్రపంచమంతటా అహ్మదియ్యత్ వ్యాపించినది.

హ|జ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. సత్రము ఖర్చు పెరిగి, అధికముగా అతిథులు ఖాదియాన్ రావడం మొదలైనప్పుడు ఈ ఖర్చులను ఎలా పూర్తి చేయగలమను ప్రత్యేక వ్యాకులత హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు కలిగినది. కానిప్పుడు అల్లాహ్ తఆలా కృపానుసారము ఒక్క అహ్మది మొత్తం సత్రము ఖర్చును చెల్లించగలడు. (ఇది హ|జ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) కాలము నాటి విషయము. ఇప్పుడు అల్లాహ్ తఆలా కృసానుసారము మరింత విశాలత ఏర్పడినది.)

ఇట్లనిరి. హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం భూకంపము గురించి తమ భవిష్యవాణీలను ప్రచురించినప్పుడు అధికముగా అహ్మదీయులు ఖాదియాన్ వచ్చిరి. హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ మిత్రులతో కలిసి తోటకు వెళ్లి అక్కడే గుడారములలో విడిది చేయడం మొదలు పెట్టిరి. ఆ రోజులలో అధికముగా ఖదియాన్‌లో అతిథులు రాసాగిరి. ఒక రోజు వారు మా తల్లిగారితో ఇట్లనిరి. ఇప్పుడు డబ్బులు లభించే ఏ స్థితి కనిపించడం లేదు. (ఖర్చులు చాలా అధికమైనవి.) కావున ఎవరితోనైనా రుణము తీసుకోవలెనని నేను భావించుచున్నాను. (ఇది హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనిరి) ఎందుకనగా ఇప్పుడు ఖర్చుల కొరకు నగదు లేదు. కొంత సమయము తరువాత వారు జుహ్ర్ నమాజు కొరకు వెళ్లి పోయిరి. తిరిగివచ్చునప్పుడు వారు చిరునవ్వు చిందించుచుండిరి. తిరిగి వచ్చిన తరువాత మొదట వారు గదిలోకి పోయిరి. కొంత సమయము తరువాత బయటికి వచ్చి తల్లిగారితో ఇట్లనిరి. అల్లాహ్ తాలా సంకేతములను వరుసగా చూచినను మానవుడు కొన్ని సార్లు అనుమానించును. అతిథి గృహము కొరకు డబ్బులు లేనందున ఎవరితోనైనా రుణము తీసుకోవాలని నేను భావించితిని. కాని నేను నమాజ్ కొరకు పోయినప్పుడు మాసిన దుస్తులు వేసుకున్న ఒక వ్యక్తి ముందుకు వచ్చి ఒక సంచి నా చేతిలో పెట్టెను. అతని పరిస్థితిని చూచి అందులో కొన్ని పైసలు వుండవచ్చునని నేను ఊహించితిని. (బరువుగా యుండెను. నాణెముల వలన దాని బరువు పెరిగినది కొన్ని పైసలు యుండవచ్చును) కాని ఇంటికి వచ్చి దానిని తెరువగా కొన్ని వందల రూపాయలు దానిలో వెలువడినవి. నేటి చందాలకు పోటీగా ఆ రూపాయలు ఏ స్థితి కలిగినవి. నీవు సత్రము ఒక రోజు ఖర్చును ఇచ్చినచో నీకు హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములోని ఒక రోజు ప్రసాదించబడునని చెప్పినచో ఒక్క రోజు కాదు ఒక్క సంవత్సర ఖర్చును మీరు నాతో తీసుకోగలరు. కాని దైవము కొరకు హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములోని ఒక్క రోజు నాకు ప్రసాదించగలరని అనును. కాని హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో త్యాగము చేసిన వారికి లభించినది నేడు ఎవరికి లభించును.

(తఫ్సీరె కబీర్ సంపుటి 9 పుట 341)


నిస్సందేహముగా త్యాగములు పెరిగినవి. హ|జ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. నేను నా ఖుర్‌ఆన్‌పై ఒక చిన్న సూచన వ్రాసుకొంటిని. సందేశహరుని కాలమును చూచిన వారి హృదయ భావాలను అది విపులముగా తెలుపును. నేను సలాం గురించి సూచన వ్రాసితిని. అనగా ఆ రాత్రిలో శాంతియే శాంతి గలదు. అల్ ఖద్ర్ అధ్యాయ విశ్లేషణలో ఇట్లు వ్రాసిరి. ఆహా! మసీహ్ మౌవూద్ సమయము. అప్పుడు కొందరే యుండిరి. (ఈ సూచన వ్రాసి యుండెను) ఆహా! మసీహ్ మౌవూద్ సమయము. అప్పుడు కొందరే యుండిరి కాని శాంతి యుండెను. తరువాత అల్లాహ్ తఆలా మనకు చాలా అభివృద్ధి ప్రసాదించెను. కాని ఈ అభివృద్ధి మసీహ్ మౌవూద్ కాలమునకు ఎక్కడ పోటీగా నిలువగలదు. (తఫ్సీరె కబీర్ సంపుటి 9 పుట 340)

నిస్సందేహముగా నేడు ప్రజలు మన మాటు ఎక్కువ వింటున్నారు. అధిక ప్రజల వరకు మనము చేరినాము. పెద్ద పెద్ద రాజకీయ నాయకులకు, ప్రభుత్వములకు మనము మన మాట వినిపించుచున్నాము. ఆర్థికంగా జమాఅత్ హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలము కంటే ఎక్కువ గట్టిగా గలదు. నేడు ఒక్కొక్క వ్యక్తి ఇచ్చుచున్న చందా హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో ఒక్క సంవత్సరము లేదా రెండు సంవత్సరములలో కూడ అంత చందా వచ్చేది కాదు. అయినను ఈ కాలము ఆ కాలము కంటే ఉత్తమమైనదని ఎవరు అనలేరు. ఆ కాలమును పొందలేము కాని వారి కార్యమును పూర్తి చేయుటకు అదే విధేయత, విశ్వసనీయతతో పని చేయాలని మనలో ఉత్సాహము, ఉద్రేకము యున్నచో ఇప్పటికి మనము హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దుఆలకు వారసులము కాగలము. ఏ స్ఫూర్తి వారు కలుగజేయ దలచిరో, తమ అనుచరులలో పుట్టించిరో ఆ ఆధ్యాత్మికతలో ప్రగతి సాధించుటకు కృషి చేయవలెను.

హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవిత వివిధ కోణములను తెలుపు హ|జ్రత్ ముస్లిహ్ మౌవూద్ గారి పలు సూచనలు గలవు. అవి వారి కాలమునకు చెందినవే. వాటిని ప్రవేశపెట్టెదను.

హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరుల ప్రేమను వర్ణించుచు హ|జ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఇట్లనిరి. "మేము హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను చూచితిమి. వారిని దర్శించిన వారికి వారితో గల ప్రేమను వారి తర్వాత వచ్చిన ప్రజలు లేదా హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాంలో చాలా తక్కువ వయసున్న వారు అంచనా వేయ లేరు." (వారి కాలములో యుండిరి. కాని చిన్న వయస్కులైనందున అంత అవగాహన లేకుండెను) కాని నాకు అల్లాహ్ ఎటువంటి హృదయము అందించెననగా నేను బాల్యము నుండే ఈ విషయము వైపు చాలా దృష్టి కలిగియుంటిని. హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సహవాసము పొందిన వారికి వారితో గల ప్రేమను నేను అంచనా వేసితిని. నేను సంవత్సరముల కొద్ది వారిని చూచితిని. హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వీడ్కోలు వలన వారికి జీవితములో ఎలాంటి ఆనందము కలిగేది కాదు. (హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మృతి తరువాత) ప్రపంచములో ఎటువంటి ఆడంబరము కనిపించక పోయేది. ఇట్లనిరి. హ|జ్రత్ ఖలీఫా అవ్వల్ గారి ధైర్యము, సాహసము గురించి తెలిసిన వ్యక్తులకు వారెంత గట్టి, దృఢమైన వారో తెలుసు. వారు తమ బాధలను, ఇబ్బందులను బహిర్గతము కానిచ్చేవారు కాదు. కాని వారు ఒంటరిగా యున్నప్పుడు, మరెవరు దగ్గర లేనప్పుడు నాతో ఇట్లనేవారు. మియాఁ! హ|జ్రత్ గారు మృతి చెందినప్పటి నుండి నాకు నా శరీరము ఖాళీ ఖాళీగా అగుపించుచున్నది. ప్రపంచము మొత్తం ఖాళీ ఖాళీగా కనిపించుచున్నది. నేను ప్రజలలో తిరుగుచు పనిచేయుచుందును.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

అయినను ప్రపంచములో ఏమియును మిగలలేదని అనిపించును. వారే కాక హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సహవాసములో యున్న అనేకులను నేను చూచితిని. వారి ప్రేమ, అనురాగము ఎంత పెరిగియుండెననగా ఏ వస్తువు వారికి ఆనందము కలిగించలేదు. మా ప్రాణము పోయి మేము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను కలిసినచో బాగుండునని వారు కోరుకొనే వారు.

(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 1 పుట 144-145)

మరో చోట జమాఅత్ కార్యకర్తలను ప్రత్యేకముగా ధరలు పెరిగి, బీదత్వము అధికముగా యున్న దేశములలో యుంటున్న వారిని ఉద్దేశించి ఉపదేశించుచు ఇట్లనిరి. సంస్థపై దృష్టి సారించే బదులు అల్లాహ్‌తో యాచించవలెను. ఈ కోణములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఒక చిన్న ఉదాహరణను హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) తెలిపిరి. "హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు చలి తీవ్రముగా కలిగేది. అందుకే వారు ముష్క్ ఉపయోగించేవారు." (ఇంటి వైద్యులు సూచించే ఒక ఔషధమిది. ముష్క్ సేవించడంతో చలి దూరమగును.) సీసా నింపుకొని కీసములో పెట్టుకునేవారు. అవసరమొచ్చినప్పుడు దానిని సేవించేవారు. వారిట్లనేవారు. ఒక్క చిన్న సీసా (కీసములో ఒక చిన్న సీసా పట్టును) రెండు రెండు సంవత్సరముల వరకు నడిచేది. కాని ముష్క్ కొద్దిగా యున్నదని ఆలోచన వచ్చినప్పుడు సీసాను చూసేవాడిని. అప్పుడది అయిపోయేది. (చూడకుండా సేవించుచున్నంత వరకు అందులో శుభము కలిగేది. కాని నేను చూసిన కొద్ది కాలము తర్వాత అది అయిపోయేది.) హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. అల్లాహ్ తఆలా తమ దాసులకు తెలియకుండానే ఆహారము నొసంగును. ఆహారము నొసంగు అతని పద్ధతులు చాలా అరుదైనవి. ఎవరి నిధి అంతము కాదో ఆ ఉనికితో మీరు యాచించుము. వేతనములను పెంచే స్థోమతి లేని సంస్థను మీరెందుకు అడుగుచున్నారు. మీరు అల్లాహ్ తఆలాతో బంధమును పెంచుకొనుము (అల్లాహ్ తఆలాను ఆరాధించుము) అల్లాహ్ పరోక్షముగా మీకు ఆహారము నొసంగును. (అతనితోనే యాచించుము.) మీకు అధిక వేతనము ఇచ్చుటకు సదర్ అన్జుమన్ అహ్మదియ్య వద్ద అంత నగదు లేదు. తుదకు జమాఅత్ చందాల ద్వారానే దానికి నిధులు వచ్చును. అది ఇంత ఎక్కువగా యుండదు.

(అల్‌ఫజల్ 18 ఫిబ్రవరి 1956 పుట 5 సంపుటి 10 సంచిక 45 నం.42)

ఆయా దేశములలో ధరల పెరుగుదల చాలా ఎక్కువగా యున్నది. కొందరి పిరిస్థితులు ఎటుల యుండుననగా మాకు పూట గడవడం లేదని అందురు. నాకు కొందరు ఉత్తరములు వ్రాయుదురు. నేని చెప్పినట్లు నాకీ విషయము తెలుసు. పాకిస్తాన్, భారత దేశములో ధరల పెరుగుదల చాలా ఎక్కువ గలదు. కార్యకర్తలకు చెల్లించుచున్న వేతనముతో పూట గడవడం చాలా కష్టమే. ఎంత ఎక్కువ సౌకర్యము ఇవ్వగలమో అంత ఇవ్వడం జరుగుచున్నది. కఠిన బీదత్వములో జీవితము గడుపుచున్న వారి వైపు ఇటువంటి వారు చూడవలెను. వ్యాధి సోకినచో పిల్లలకు, తమకు చికిత్స చేయించుకునే స్థోమత కూడ యుండదు. కునక అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపవలెను. అల్లాహ్‌ను నమ్మవలసిన అవసరమున్నది. అటు ఇటు తొంగి చూచే బదులు తమ సర్వ అవసరముల కొరకు అతని వైపు చూడుము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం భవిష్యవాణీల ప్రస్తావనలో ఒక భవిష్యవాణిని ప్రస్తావించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. వందలాది భవిష్యవాణీలు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరువాత పూర్తి అయినవి. అవి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యమునకు స్పష్టమైన సాక్ష్యముగా నిలిచినవి. ఉదా॥ అతడు గొప్ప గౌరవము, మర్యాద, ధనము గలవాడు అగునని నా గురించే వారి భవిష్యవాణి యుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితములో వారి ఆస్తి ఎంత యుండెనో చూడుము. వారు తమ వ్యతిరేకులకు సవాలు విసురుతూ తమ పది వేల విలువ గల ఆస్తిని ప్రవేశపెట్టుచున్నాని అనిరి. అనగా అప్పుడు పది వేల రూపాయల విలువ గల ఆస్తి వారికుండెను. కాని అదిప్పుడు లక్షల విలువ గలదైనది. ఇది ఎక్కడి నుండి వచ్చినది. ? ఇదంతా అల్లాహ్ తఆలా శుభము. కాని నాకింకా గుర్తున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పరమపదించిన తరువాత నానాజాన్ (హజ్రత్ మీర్ నాసిర్ నవాబ్ గారు) మా భూములకు సంబంధించిన పత్రములను తిరిగిచ్చిరి. (హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో వారి బాధ్యతలో యుండెను. వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరణము తరువాత పత్రములను హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) గారికి తిరిగిచ్చిరి.) నేనిప్పుడు ఏమి చేయగలని నిస్సహాయతను భావించుచుంటిని. దైవికముగా షేఖ్ నూర్ అహ్మద్ గారు నా వద్దకు వచ్చి, ఇట్లనిరి. మీకొక ఉద్యోగి అవసరమని నాకు తెలిసినది. మీరు నన్ను నియమించుకోగలరు. (భూముల నిర్వహణకు ఒక నిర్వహకుడు అవసరముండెను) నేను వేతనము ఎక్కడి నుండి ఇవ్వను, వేతనము ఇవ్వడానికి నా వద్ద నగదు లేదు, భూముల నుండి అంత ఆదాయము వచ్చే ఆవకాశము లేదని నేనంటిని. మీరు ఎంత తక్కువ వేతనము ఇవ్వగలరో ఇవ్వండి. మీరు నెలకు పది రూపాయలు ఇవ్వండని వారే స్వయముగా అనిరి. కావున నేను వారిని ఉద్యోగిగా నియమించుకొని ఇంత వరకు ఎలాగైనా ఆదాయం కలుగునని ఆశించితిని. కాని తరువాత అల్లాహ్ తఆలా ఎలా శుభము కలిగించెననగా నగరము ప్రగతి చెందిన కొద్ది భూముల విలువ కూడ పెరుగుచు పోయినది. పవిత్ర ఖుర్‌ఆన్ మొదటి అనువాదము ముద్రించే సమయము వచ్చెను. (కొందరు వ్యక్తులు ధనము ఎక్కడ వినియోగించిరి. ధనము ఎక్కడి నుండి వచ్చినదని విమర్శింతురు. అందుకు సమాధానము కూడ ఇందులో గలదు) ఇట్లనిరి. పవిత్ర ఖుర్‌ఆన్ మొదటి అనువాదము ముద్రించే సమయము వచ్చినప్పుడు ఈ అనువాదము ముద్రణకు అయ్యే ఖర్చు మొత్తం మా కుటుంబము భరించాలని నేను కోరితిని. (అనగా వారు, వారి సోదరీ, సోదరుమణులు) అప్పుడు నేను షేఖ్ నూర్ అహ్మద్ గారిని పిలిపించి, ఇట్లంటిని. నాకిప్పుడు రెండు వేల రూపాయల అవసరమున్నది. ఏర్పాటు కాగలవా ? మీరు భూమిలోని కొంత భాగమును గృహాల కొరకు విక్రయించే అనుమతి ఇచ్చినచో మీరు కోరినంత నగదు ఏర్పాటు కాగలదు. కనుక కొంత భూమిని విక్రయించే అనుమతి నేను ఇచ్చితిని. ఆ భూమి సుమారు 50 కనాల్ యుండెను. తరువాత దారుల్ ఫజల్ వీధి ఏర్పడిన చోట ఆ భూమి యుండెను. కొంత సమయము తరువాత షేఖ్ గారొచ్చిరి. వారి చేతిలో రూపాయల సంచి యుండెను. ఇవి రెండు వేల రూపాయలు. మీకు పది వేల రూపాయల అవసరమున్నా లభించును. నాకిప్పుడు ఇంత నగదే అవసరమున్నదని నేనంటిని. (పవిత్ర ఖుర్‌ఆన్ ముద్రణకు రూపాయలు అవసరముండెను) ఎక్కువ అవసరము లేదు. ఖాదియాన్‌లో గల దారుల్ ఫజల్ వీధి గురించి వారిట్లనిరి. ఈ విధముగా ఆ వీధి ఏర్పాటు మొదలైనది. ఆ నగదు పవిత్ర ఖుర్‌ఆన్ ముద్రణకు ఖర్చు చేయబడెను.

(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 3 పుట 681, 682)

ఖాదియాన్‌తో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంనకు గల ప్రేమను ప్రస్తావించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంనకు ఖాదియాన్‌తో ఎలా ప్రేమ యుండెనో, వారెలా చూసేవారో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. అల్లాహ్‌కు ఏ ప్రాంతములతో బంధము ఏర్పడునో అవి శాశ్వతముగా శుభప్రదము చేయబడును. ఖాదియాన్ కూడ ఆ కోవకు చెందిన ఒక ప్రదేశము. ఇక్కడ దేవుని ఒక అవతారుడు అవతరించెను. వారిక్కడే మొత్తం జీవితమును గడిపిరి. ఈ ప్రాంతమును వారు ప్రేమించేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లాహోర్ పర్యటించినప్పుడు (హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చివరి రోజులలో వ్యాధికి గురైనప్పుడు లేదా తమ చివరి రోజులలో లాహోర్‌నకు వెళ్లినప్పుడు అక్కడే వారు పరమపదించిరి.) వారు మృతి చెందిరి. ఒక రోజు నన్ను ఒక గదిలోకి పిలిచి నాతో ఇట్లనిరి. మహ్మూద్ చూడుము! ఈ ఎండ పసుపు రంగులో కనిపించుచున్నది. రోజు చూచుచున్నట్లే నాకు కనిపించుచున్నదని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు అనిరి. ఇక్కడి ఎండ కొంత పసుపు రంగులో కాస్త మసకగా కనిపించుచున్నది, కాని ఖాదియాన్ ఎండ చాలా శుభ్రముగా, మంచిగా కనిపించునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అనిరి. వారు ఖాదియాన్‌లోనే సమాధి కావలసి యుండెను. కనుక వారీ విధముగా ప్రవచించిరి. దీనితో వారికి ఖాదియాన్‌తో గల ప్రేమానురాగము స్పష్టమగును.

(అన్వారె ఖిలాఫత్, అన్వారుల్ ఉలూమ్ సంపుటి 3 పుట 175)

అశ్వ రోహనకు సంబంధించిన తమ మరో సంఘటన లేదా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సైకిల్ తొక్కుటను, అశ్వ రోహనను ఎలా పోల్చిరని తెలుపుచు ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తమ మృతి కంటే కొంత కాలము ముందు నాకొక అశ్వము కొనిచ్చిరి. వాస్తవానికి అది కొనివ్వలేదు, కానుకగా పంపబడినది. దీని వివరణ ఇట్లు గలదు. బాలలను సైకిల్ తొక్కుచు నేను చూడగా సైకిల్ నడపాలనే కోరిక నాకు కూడ కలిగినది. నేను దీనిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో ప్రస్తావించితిని. నాకు సైకిల్ తొక్కుట ఇష్టము లేదు. నేను మాత్రం అశ్వ రోహనను పురుష సవారీగా భావించెదను. అయితే మీరు నాకు అశ్వమే ఇప్పించగలరని నేనంటిని. నాకు గట్టిగా, శక్తివంతమైన అశ్వమే ఇష్టముండునని వారనిరి. నేను మంచి రోహనునిగా తయారైతానని వారి ఉద్దేశము కావచ్చును. కనుక మంచి అశ్వము కొనుగోలు చేసి

పంపగలరని కపూర్‌థలా నివాసి అబ్దుల్ మజీద్ ఖాన్ గారికి వ్రాసిరి. ఖాన్ గారికి ఎందుకు వ్రాసినారనగా ఖాన్ గారి తండ్రి రాష్ట్ర అశ్వశాలకు పర్యవేక్షకులుగా యుండిరి. వారి కుటుంబమునకు అశ్వముల గురించి మంచి అవగాహన యుండెను. వారొక అశ్వమును కొనుగోలు చేసి పంపిరి. కాని ధర తీసుకోలేదు. హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మృతి చెందిన తర్వాత మా ఆర్థిక స్థితి తప్పక ప్రభావితమయ్యేను. అందుకే ఆ అశ్వమును విక్రయించవలెనని నేను భావించితిని. (హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏ సవారీకి ప్రాధాన్యత ఇచ్చిరి, తరువాత హ్జ్రత్ ముస్లిహ్ మౌవూద్ తమ స్థితులను తెలిపిరని మొదటి భాగములో వచ్చినది. ఇప్పుడు పూర్తి సంఘటనను తెలిపెదను) తద్వారా దీని ఖర్చుల భారము తల్లిగారిపై పడకుండా అగును. (ఎందుకనగా ఆ తరువాత ఆదాయ మార్గములు తక్కువ యుండెను. హ్జ్రత్ అమ్మాజాన్ ఉమ్ముల్ ముమినీన్‌పై భారము పడుచుండెను.) ఇట్లనిరి. నా ఈ ఆలోచన తెలిసి ఇప్పటికి జీవించియున్న ఒక మిత్రుడు ఈ అశ్వము హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కానుక అయినందున దీనిని అస్సలు విక్రయించకూడదని చెప్పి పంపెను. అప్పుడు నా వయసు 19 సం॥లు యుండెను. నాతో ఈ విషయము చెప్పబడిన ప్రదేశము నాకింకా గుర్తున్నది. అప్పుడు నేను కాలువ తీరమున తష్‌హీజుల్ అజ్‌హాన్ కార్యాలయమునకు దక్షిణ తూర్పున నిలిచి యుంటిని. ఈ అశ్వము హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కానుక అయినందున విక్రయించకూడదని నాతో చెప్ప బడినప్పుడు వెంటనే నా నోటి నుండి వెలువడిన పదములిట్లు గలవు. నిస్సందేహముగా ఇది హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కానుకయే. కాని దీని కంటే గొప్ప కానుక ఉమ్ముల్ ముమినీన్ (మా తల్లి) గారు. కనుక అశ్వము కొరకు నేను ఉమ్ముల్ ముమినీన్‌ను ఇబ్బంది పెట్టదలచలేదు. అందుకే ఆ అశ్వమును విక్రయించితిని.

(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 19 పుట 31,32)

నేను చెప్పినట్లు దీనితో హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వీర మనస్తత్వము కూడ తెలియును. వారు ఇతర వాహనముపై అశ్వ రోహనమునకు ప్రాధాన్యత నిచ్చిరి. హ్జ్రత్ ఉమ్ముల్ ముమినీన్ (రజి) పట్ల హ్జ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) భావములు కూడ తెలియును.

హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరణము, తమ స్థితిని వివరించుచు ఇట్లనిరి. హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మృతి చెందినప్పుడు వారు అకస్మాత్తుగా మృతి చెందినారని భావించబడెను. కాని దీని గురించి నాకు కొన్ని విషయములు ముందే తెలిసినందున ఏదో విప్లవము రాబోవుచున్నదని ఊహించితిని. ఉదా॥ నేను సత్యస్వప్నములో ఇట్లు చూచితిని. నేను బహిష్తి మఖ్బరహ్ నుండి ఒక పడవలో వచ్చుచున్నాను. దారిలో నీరు వరదగా ప్రవహించుచున్నందున తీవ్ర సుడిగుండం ఏర్పడుచుండెను. ఫలితముగా పడవ ప్రమాదములో పడుచుండెను. కావున పడవలో కూర్చున్న వారందరు భయపడ సాగిరి. వారి ఈ స్థితి నిరాశ వరకు చేరెను. అప్పుడే నీటిలో నుండి ఒక హస్తము బయటికి వచ్చెను. ఆ హస్తములో ఒక ఉత్తరము యుండెను. దానిలో ఇట్లు వ్రాసియుండెను. ఇక్కడ ఒక పీర్ గారి సమాధి యున్నది. వారితో మనవి చేసినచో పడవ ముందుకు వెళ్లును. నేనిట్లంటిని. ఇది అన్యారాధన. మా ప్రాణము పోయినను మేమిలా చేయము. ఇంతలోనే ప్రమాదము మరింత పెరిగినది. ఇలా చేయడంలో అభ్యంతరమేముందని ఇతరులు కొందరనిరి. వారు నాకు తెలియకుండానే పీర్ గారికి లేఖ వ్రాసి నీటిలో పడ వేసిరి. (ఇదంతా స్వప్నములో నాకు కనిపించుచున్నది.) నాకీ విషయము తెలిసినప్పుడు నేను వెంటనే నీటిలో దూకి ఆ లేఖను బయటికి తీసుకొంటిని. (వెంటనే నీటిలో దూకి, ఆ లేఖను తీసిరి) నేనిలా చేయగానే ఆ పడవ నడవడం మొదలైనది. ఎలాంటి ప్రమాదము లేకుండెను. ప్రమాదమంతా దూరమగుట మొదలగుచుండెను. ఇట్లనిరి. హ్జ్రత్ గారు పరమపదించినప్పుడు అల్లాహ్ నా హృదయమును చాలా దృఢపరచెను. ఇప్పుడు మనపై చాలా పెద్ద బాధ్యత మోపబడనుందని నాకు తక్షణమే అర్థమైనది. నేనప్పుడు వెంటనే ఇట్లు ప్రతిజ్ఞ చేసినాను. నేను నీ మసీహ్ మౌవూద్ భౌతికకాయము వద్ద నిలిచి ఈ కార్యమును చేయుటకు ప్రపంచములో ఒక్క వ్యక్తి లేకున్నను నేనుంటానని అంగీకరించుచున్నాను. అప్పుడు నాకు కలిగిన శక్తిని నేను వర్ణించలేను. (ఖితాబ్ జల్సా సాలానా 27 డిశంబర్ 1919, అన్వారుల్ ఉలూమ్ సంపుటి 4 పుట 523, 524)

ఈ విషయమును మరింత విస్తారముగా తెలుపుచు జమాఅత్‌ను ఉపదేశించుచు ఆపదలు, కష్టములతో భయపడకూడని ఇట్లనిరి. హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మృతి చెందినప్పుడు వారు మృతి చెందినది సరియైన సమయము కాదని ప్రజలు అంటున్నట్లు నేను విన్నాను. ఇలా అనేవారు వారు అసత్యులని అనలేదు. కాని వారింకా అల్లాహ్ తఆలా సందేశము మంచిగా అందించలేదు, వారి పలు భవిష్యవాణీలు పూర్తి కాని సమయములో వారు మృతి చెందిరని అనేవారు. అప్పుడు నా వయసు (ఇంతకు ముందు చెప్పినట్లు) 19 సం॥లు యుండెను. నేని ఇటువంటి విషయములను విన్నప్పుడు వారి పార్థివ దేహం తల వద్ద నిలిచి అల్లాహ్ తఆలాను ఉద్దేశించి ఇట్లు దుఆ చేసితిని. ఓ అల్లాహ్! ఇతడు నీ ప్రసన్నుడు. ఇతడు జీవించి యున్నంత వరకు నీ ధర్మ స్థాపన కొరకు త్యాగములు చేసెను. నీవు ఇతన్ని నీ వద్దకు పిలిపించుకున్నప్పుడు ఇతడు మృతి చెందిన సమయము సరియైనది కాదని ప్రజలంటున్నారు. ఇటుల అనేవారు లేదా వీరి మిత్రులు దీని వలన మోసపోయి, జమాఅత్ ఐక్యత చెదిరి పోయే అవకాశమున్నది. కనుక ఓ అల్లాహ్! నేను నీతో ప్రతిజ్ఞ చేయుచున్నాను. జమాఅత్ మొత్తం నీ జమాఅత్‌ను వీడినను నేను దీని కొరకు ప్రాణమును పణంగా పెట్టి పోరాడెదను. నేనే ఈ పని చేయవలసియున్నదని అప్పుడు అర్థము చేసుకొంటిని. ఈ విషయమే 19 సం॥ల వయసులో నాలో ఒక ఆవేశము రగిలించెను. తద్వారా నేను నా జీవితమును మొత్తం ధర్మ సేవకు అంకితం చేసితిని. హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏ కార్యము కొరకు వచ్చిరో దానిని నేనే చేయాలని ఇతర ఉద్దేశములన్నిటిని వీడి ఈ ఒక్క ఉద్దేశమునే నా దృష్టిలో వుంచుకొంటిని. ఆ సమయములో నా హృదయములో ఏర్పడిన సంకల్పము నేటి వరకు వివిధ కోణములలో నాలో పొందుచున్నాను. వారి తల వద్ద నిలిచి చేసిన ప్రతిజ్ఞ మార్గదర్శిగా మారి నన్ను నడిపించుచున్నది. ఆ ప్రతిజ్ఞ వల్లనే ఇంతటి దృఢత్వముతో నేను స్థిరముగా యుండగలిగినాను. వందలాది వ్యతిరేక పవనాలు నాకు విరుద్ధముగా వీచి, ఈ పర్వతమును ఢీకొని తమ తలను పగులగొట్టుకొనెను. వ్యతిరేకులు నాకు విరుద్ధముగా చేసిన ప్రతి ప్రయత్నము, మోసము, కుట్ర తిరిగి వారికే ఎదురైనది. అల్లాహ్ తఆలా తన ప్రత్యేక శుభముతో ప్రతి సందర్భమున నాకు విజయములు ప్రసాదించెను. హ్జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మృతి సందర్భమున వారు మృతి చెందినది సరియైన సమయము కాదని అన్నవారే వారి మిషన్ విజయములను చూచి ఆశ్చర్యచకితులైనట్లు కనిపించుచున్నారు. ఈ పనిని నేనే చేయాలని ఏ వ్యక్తి ప్రతిజ్ఞ చేయునో, అర్థము చేసుకొనునో అతని మార్గములో వేలాది కష్టములు ఎదురైనను, వేలాది అవరోధములు ఏర్పడినను వేలాది ఆటంకములు అతని మార్గములో కలిగినను అతడు వాటన్నిటిని దాటిపోవును. విజయము అతనికి స్వాగతం పలుకుచున్న మైదానము వరకు అతను చేరును. (ఇప్పుడు జమాఅత్ సభ్యులు వినదగిన ఉపదేశము గలదు) ధర్మ కార్యమును నేనే చేయాలని మన జమాఅత్‌లోని ప్రతి వ్యక్తి ప్రతిజ్ఞ చేయవలెను. ఈ ప్రతిజ్ఞ తర్వాత వారిలో చైతన్యం పుట్టుకొచ్చును. ఈ ప్రతిజ్ఞ తర్వాత వారిలో చైతన్యమేర్పడును. ప్రతి కష్టము వారి కొరకు సరళమగుచూ పోవును. ప్రతి ఇబ్బంది వారి కొరకు సులభమగును. ప్రతి కఠినము సౌకర్యముగా మారును. (ప్రతి కొరత వారి కొరకు సులభమగును) పలు కష్టములు, బాధలు, ఇబ్బందులు నిస్సందేహముగా ఎదురగును. కాని వాటిలోనే వారు నిజమైన విశ్రాంతిని పొందెదరు. ధర్మ పరిపూర్ణత కొరకు నీవే నా ఉద్దేశమని అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌లో రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను ఉద్దేశించి చెప్పెను. అనుచరులు ఇందులో పాల్గొనినను పాల్గొనక పోయినను నేను నీతో తప్పక ఈ కార్యమును తీసుకొనెదను. అందుకే రాత్రింబవళు వారి కార్యములో నిమగ్నమై యుండేవారు. అల్లాహ్ ధర్మమును ప్రపంచములో స్థిరపరచుటకు వారి ప్రతి కదలిక, ప్రతి నిలుపుదల, వారి ప్రతి మాట, వారి ప్రతి కార్యము సమర్పితమై యుండెను. వాస్తవానికి ఇది మరొకరిది కాదు, నా పనేనని వారు భావించేవారు. ఇదే పద్ధతిని మనము అవలంభించవలసిన అవసరమున్నది.

ఈ పద్ధతినే మనము అవలంభించవలెను.

అల్లాహ్ తఆలా అనుగ్రహములు, జమాఅత్ ప్రగతి, మన బాధ్యతల గురించి వారిట్లనిరి. ఈ ప్రతిజ్ఞను పూర్తి చేయు అనుగ్రహము అల్లాహ్ తఆలా నాకు తన కరుణతో మాత్రమే ప్రసాదిచెను. (అది ప్రస్తావించబడెను) నేను వారి అలైహిస్సలాం సందేశమును ప్రపంచ నలు మూలల వరకు అందించుటకు నా జీవితమును అంకితం చేసితిని. ఫలితముగా ప్రపంచములోని అధిక దేశములలో మన కార్యాలయములు ఏర్పడినట్లు ప్రతి ఒక్కరు చూచుచున్నాడు. అన్యారాధనలో నిమగ్నమైన, క్రైస్తవంలో చేరిన వేలాది మంది ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్, శాంతి ప్రార్థనలు పంపుచున్నారు. కాని ఫలితములన్ని వెలువడినను ఇప్పుడు ప్రపంచ జనాభా 7 కోట్లు గలదని వారందరికి ఏకైక దేవుని సందేశము అందించాలని, వారిని ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 8. Thursday, 03 OCT 2024 Issue No - 40.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

వసల్లం సభ్యులలో చేర్చుట అహ్మదియ్యా జమాఅత్ కర్తవ్యమని మనము మరచి పోకూడదు. చాలా పెద్ద కార్యము మన ముందున్నది. మన బలహీన భుజములపై చాలా పెద్ద భారము మోపబడినది. ఇంతటి ముఖ్యమైన కార్యములో అల్లాహ్ సహాయము, సహకారాము లేనిదే మనకు సఫలము లభించుట అసాధ్యము. మనము అతని బలహీన, సాధారణ దాసులము. అతని అనుగ్రహము లేనిదే మన ఏ కార్యము సఫలీకృతము కాలేదు.

(అల్‌ఫజల్ 2 జనవరి 1963 పుట 1 సంపుటి 52/27 యం.2)

కనుక అతని అనుగ్రహములను పొందుటకు సాధ్యమైనంత వరకు మనము కృషి చేయవలెను. వారు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తల వద్ద నిలిచి చేసిన ప్రతిజ్ఞను గుర్తుచేసుకోవలెను. ఇది మనందరి ప్రతిజ్ఞ కావలెను. ఎందుకనగా దానితోనే అభివృద్ధి లభించును. ఇందులోనే మనము జమాఅత్ క్రియాశీల భాగము కాగలము. ఎందుకనగా ఇది దైవ కార్యము. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఒక చోట ఇట్లనిరి. మనము ఒక మానవునితో ఇటుల ప్రతిజ్ఞ చేయగలగినప్పుడు (వారు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తలాపున నిలబడి చేసినట్లు) ఓ అల్లాహ్! ప్రపంచమంతయు నిన్ను వీడినను మేము వీడమని అల్లాహ్ తఆలాతో ఎందుకు చేయలేము.

ఇది దైవముతో జరుగును. అన్యారాధన నుండి కూడ దూరముండుము, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం లక్ష్యమును పూర్తి చేయుటకు శతవిధాలా కృషి చేయుదుమని కూడ మనలోని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయవలసిన అవసరమున్నది. ఈ కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పతాకమును ఎగురవేయుటకు మనము అల్లాహ్‌తో చేసిన ప్రతిజ్ఞనను కూడ పూర్తి చేయుదుము. ఇన్షాఅల్లాహ్!

అల్లాహ్ తఆలా మనకు ఈ అనుగ్రహము ప్రసాదించు గాక! (ఆమీన్)

---

(7వ పేజి తరువాత)

కావున కుక్క యొక్క సంఖ్యననుసరించి మరణించును. ఆ సంఖ్య 52 సంవత్సరములను సూచించుచున్నది. అనగా అతని వయస్సు 52 సం॥. అతను 52 సం॥ల వయస్సును మించి జీవించలేదు. ఎప్పుడైతే అతను 52 సం॥లకు చేరుకొనునో ఆ సంవత్సరములోనే మరణించును.

ఇప్పుడు నేను నా ప్రథమ ప్రస్థానం వైపు వచ్చెదను. మన సంఘం ఒక పవిత్రమైన సంఘం. ఈ సంఘం సమయానుకూలంగా భూమ్యాకాశముల దైవము నుండి పంపబడిన ఆ అవతార పురుషున్ని స్వీకరించినది.

వారి హృదయాలు స్వీకరించుటకు ఎలాంటి ఇబ్బందులకు గురి కాలేదు. ఎందుకనగా వారు పుణ్యులు. అంతేగాకా దైవము కూడ వారిని ఎన్నుకొనెను. దానకర్తుడు వారికి శక్తినిచ్చెను. ఇతరులకు ఇవ్వలేదు. మరియు వారి హృదయాలను తెరిచెను. ఇతరుల హృదయాలను తెరువలేదు. కావున ఎవరైతే స్వీకరించిరో వారికి అధికముగా అనుగ్రహించును. వారి వృద్ధి జరుగును. కాని ఎవరైతే స్వీకరించ లేదో వారి నుండి వారి వద్ద క్రితం నుండి ఉన్నది కూడ తీసుకోబడును. చాలా మంది పుణ్యాత్ములు ఈ కాలంను పొందుటకు తపించిపోయిరి, అయినను వారు పొందలేక పోయిరి. కాని దురదృష్టం ఏమిటంటే ఈ కాలపు ప్రజలు ఈ సమయాన్ని పొంది కూడ స్వీకరించలేక పోయిరి. వీరి స్థితిగతులను ఏ జాతి ప్రజలతో పోల్చవలెను. వీరికి ఈ ఉదాహరణయే సరియగును. ఒక చక్రవర్తి తన వాగ్దానము ప్రకారం ఒక పట్టణానికి ఒక అధికారిని నియమించి పంపెను. తద్వారా ఎవరు విధేయులు, ఎవరు అవిధేయులో వాస్తవంగా తెలుసుకోదల్చెను. మరియు వారి మధ్యలో కొనసాగుచున్న జగడములన్నింటిని పరిష్కరించదల్చెను. అందకని ఆ అధికారి నిశ్చయంగా సమయానుకూలంగానే విచ్చేసెను. మరియు అతను తన ప్రభువు నామమున సందేశము అందించెను. అందరిని సన్మార్గం వైపు ఆహ్వానించెను, అంతేగాకా తానే న్యాయ నిర్ణేతనని ప్రకటించుకొనెను. అయినప్పటికి వారు అతను ప్రభుత్వ అధికారియేనా అని అనుమానించ సాగిరి. అప్పుడు తాను కేవలం ప్రభుత్వ అధికారులతో సాధ్యమయ్యే నిదర్శనమునే చూపించెను. అయినను వారు నమ్మలేదు, వారిని విశ్వసించలేదు. అంతేగాకా వారిని ధిక్కార భావంతో చూడసాగిరి. వారు తమను తామే ఉన్నతులమని భావించుకొనసాగిరి. అతను న్యాయ నిర్ణేతయని అంగీకరించలేక పోయిరి. పైగా వారిని పట్టుకొని కించపర్చ సాగిరి. అతని ముఖంపై ఉమ్మివేసిరి. అతనిని కొట్టుటకు పరుగెత్తిరి. అంతేగాకా వారిని దారుణంగా అవమాన పరిచిరి, అగౌరవ పరిచిరి. చాలా అసభ్యకర మాటలతో అతనిని తిరస్కరించిరి. అప్పుడు అతని కొరకు సిద్ధపరచిన తన ఆయుధాలన్నింటిని అతను తీసుకొని తన చక్రవర్తి వద్దకు తిరిగి వెళ్ళెను. కాని ఆ ప్రజలు ఎవరైతే అతనిని హింసించిరో వారు మరొక న్యాయ నిర్ణేత రాక కోసం ఎదురు చూడసాగిరి. అంతేగాక వారు అతను న్యాయ నిర్ణేత కాదని, విచ్చేయు అతను మరొకరని, అతని కోసమె మన మందరం ఎదురు చూడవలెనని మూర్ఖత్వపు ధోరిణి అవలంభించి, తప్పుడు ఆలోచనలపై ఏకాభిప్రాయమయ్యిరి. అందుకని వారు ఆ రోజంత అతని కోసం ఎదురు చూడసాగిరి. ఎప్పుడు వస్తాడని నిల్చోని, నిల్చోని చూడసాగిరి. వారి చక్రవర్తి ఇచ్చిన వాగ్దానమును పదే పదే గుర్తు చేసుకోసాగిరి. ఎదురు చూస్తు చూస్తు ఉండగా చివరికి సూర్యుడు అస్తమించసాగెను కాని ఎవ్వరు రాలేక పోయిరి. చివరికి సాయంత్రపు సమయాన చాలా మంది పోలిసు సైనికులు చాలా సంకెళ్ళతో వచ్చిరి. వారు రావడంతోనే ఆ దుష్టుల పట్టణంపై విరుచుకుపడిరి. ఆ తదుపరి ఒక్కొక్కరిని పట్టుకొని సంకెళ్ళు వేసిరి, వారందరిని సర్వోన్నత న్యాయ స్థానం వైపుకు శాసన ఉల్లంఘణ, ప్రభుత్వ అధికారిని దిక్కరించిన అభియోగాల క్రింద తీసుకవెళ్ళిరి. అచట వారికి ఏ శిక్షలకైతే వారు అర్హులో ఆ శిక్షలు వారికి విధించబడెను.

కావున నేను నిజమును తెలుపుచున్నాను. ఈ పరిస్థితియే ఈ కాలపు క్రూరులకు, తిరస్కృతులకు వచ్చును. ప్రతి ఒక్కరు తమ దుర్భాషల ద్వారా, దుష్టవ్రాతల ద్వారా, దుష్ట కర్మల ద్వారా బంధింపబడుదురు. ఆలకించే వారందరు శ్రద్ధగా ఆలకించండి.

*(ఇజాలే అవ్‌హాం రుహాని ఖజాయిన్, సంపుటి 3, పుట 189–191)*

---

## ఉపశాఖల వార్షిక సమావేశాలు.

**సయ్యద్నా హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు భారత ఉపశాఖల ( మజ్లిస్ అన్సారుల్లాహ్, మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్యా, అత్ఫాలుల్ అహ్మదియ్యా, లజ్నా ఇమాఇల్లాహ్, నాసిరాతుల్ అహ్మదియ్యా) 2024 వార్షిక సమావేశాలకు 25, 26, 27,అక్టోబర్ ( శుక్ర వారము, శనివారము, ఆదివారము) తేదీలను తమ కరుణతో ఆమోదించినారు. కావున శాంతి నిలయమైన ఖాదియాన్ ఆధ్యాత్మిక వాతావరణములో జరిగే ఈ సమావేశములలో పాల్గొనుటకు అన్ని ఉపశాఖల సభ్యులు నేటి నుండే సంకల్పంతో సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ సమావేశములు శిక్షణకు ఎంతగానో ఉపయోగపడును.**

---

### 129 వ వార్షిక బహిరంగ సభ, ఖాదియాన్

**సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ 129వ జల్సా సాలాన ఖాదియాన్ కొరకు 27, 28, 29, డిసెంబర్ 2024 ( శుక్ర, శని, ఆది వారాలు) తేదీలను నిర్ధారించారు, కావునా జమాఅత్ సోదరులు నేటి నుండే ప్రార్థనలు చేయుచు ఈ శుభకరమైన జల్సాలలో పాల్గొనుటకు ప్రయత్నించవలెను. అల్లాహ్ తాలా మనందరికి ఈ ధార్మిక సమావేశము నుండి లాభము ఘడించుటకు భాగ్యము కల్గించు గాకా! ఈ జల్సా అన్ని విధాల సాఫల్యము పొందుటకు, సజ్జనులు మార్గదర్శనము పొందుటకు ప్రార్థనలు చేయగలరు. జజాకుముల్లాహ్.**

**( నాజిర్ ఇస్లాహ్ వ ఇర్షాద్, ఖాదియాన్)**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz